సంపుటి : 9
సంచిక : 277
ఆదివారం
28 జూన్ 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వం వాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999

# నేనే అందరికంటే పెద్ద జెన్ జీ

**ప్రతి ఒక్కరూ కాలర్ ఎగరేసి చెప్పుకునేలా అమరావతి ఉంటుంది : సీఎం చంద్రబాబు**

**కిష్టంశెట్టిపల్లెలో 'సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్'ను ప్రారంభించిన చంద్రబాబు**

**ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టు అమలుకు నిర్ణయం - వైసీపీ మూడు ముక్కల ఆట ఆడి రాష్ట్రాన్ని దెబ్బతీసిందని విమర్శ**




**మార్కాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల అండ ఉంటే కొండనైనా ఢీ కొట్టే శక్తి తనకు వస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. మార్కాపురంను ప్రత్యేక జిల్లాగా చేసి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామన్నారు. కిష్టంశెట్టిపల్లిలో పర్యటించిన ఆయన.. సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రజలు ఆనందంగా ఉండేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. "ప్రతి ఒక్కరి ఆరోగ్యం కోసం సంజీవని లాంటి వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఆగస్టు 15 నుంచి అన్ని జిల్లాల్లో సంజీవని మిగతా .. 2లో..

## పవన్‌కు కులం రంగు పులిమారు

**అనితను మేకప్ పేరిట అవమానించారు : సీఎం చంద్రబాబు**

**వెలిగొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడలో జరిగిన ఓ ఘటనకు కులం రంగు పులిమి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేయడం, హోంమంత్రి వంగలపూడి అనిత మేకప్‌పై అవమానకరంగా మాట్లాడటం వంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. మహిళల మేకప్ గురించి మాట్లాడటానికి గొడ్డలి పార్టీ వారికి సిగ్గు అనిపించడం లేదని, పోలీసులపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇవన్నీ చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం కిష్టంశెట్టి పల్లెలో సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వైసీపీ నేతలు అమరావతిపై కుట్ర మిగతా .. 2లో..

### తిట్ల దండకమే

# వైకాపా విధానం

**జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా నేతలు ఎప్పుడూ విధానాలపై మాట్లాడరని.. తిట్ల దండకం అందుకుంటారని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గతంలో కాకినాడకు చెందిన వైకాపా నేత ఎంత దారుణంగా దూషించారో అంతా చూశారన్నారు. 11 సీట్లు వచ్చిన తర్వాత కూడా వైకాపా నేతలు ఏమాత్రం తగ్గకుండా మాట్లాడు తున్నారని అన్నారు. జనసేన నేత పంతం నానాజీ మాట్లా డిన మాటలు తాను విన్నానన్న పవన్.. అలాంటి వాటిని ప్రోత్సహించనని చెప్పారు. కుల రాజకీయాలను ఎప్పటికీ ప్రోత్సహించనని, దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీల పేరిట వేర్వేరు హాస్టళ్లు ఉండకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. పిల్లలందరికీ ఒకటే హాస్టల్ ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కులాలతో రాజకీయాలు చేయను, చేయబోనని స్పష్టం చేశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. "క్షేత్రస్థాయిలో పనిచేసిన వారి వివరాలు ఎప్పటికప్పుడు సేక రిస్తాం. సమాచారాన్ని పారదర్శకంగా సేకరించడమే కమిటీల బాధ్యత. కమిటీల ఎంపికపై కొందరు విమర్శలు చేస్తున్నారు.. అది సరికాదు. ఎన్ని ఏళ్లుగా కష్టపడుతున్నారనే దాన్ని బేరీజు వేసుకున్నాం. కమిటలో ఉన్న వారికి విధివిధానాలు అందిస్తాం. సేకరించిన సమాచారాన్ని నా దృష్టికి తేవాలి. ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న వారిని గుర్తించాలి" అని పవన్ సూచించారు.

**కుట్రపూరిత రాజకీయాలను బ్రేక్ చేస్తాను కాబట్టే నాపై కోపం**

"ఒక క్రిమినల్‌కు కులం ఎలా అంటగడతారు? ఏ ప్రాతిపదికన అతడిని వెనకేసుకొస్తారు? మీ కులం అయితే సరిపోతుందా? మీ నాయకుడు ఎవరో చెబితే, మీరేంటో నేను చెబుతాను. బూతులు తిట్టేవాళ్లను, క్రిమినల్స్‌ను మిగతా .. 2లో..

### మార్కెట్లోకి

## 'మేడిన్ ఆంధ్ర' బంగారం

**కర్నూలులో అమ్మకాలు ప్రారంభం**



**కర్నూలు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ ప్రజల చిరకాల స్వప్నం నిజమైంది. రాష్ట్రంలోనే వెలికితీసిన 'మేడిన్ ఆంధ్ర' బంగారం ఇప్పుడు మార్కెట్లో అందుబాటులోకి వచ్చింది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మిగతా .. 2లో..

### 85 వేల అక్కచెల్లెమ్మల జీవితాలతో

## సీఎం చెలగాటం ఆడుతున్నారు

**మధ్యాహ్న భోజనం వండుతున్న వారి జీవితాలతో ఆడుకుంటున్నారు**


**స్మార్ట్ కిచెన్స్ పేరుతో వారిని రోడ్డున పడేసే కుట్ర చేస్తున్నారని మండిపాటు**

**వారికి బకాయి పెట్టిన జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్**

**వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్**



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** గవర్నమెంటు స్కూళ్లలో మధ్యాహ్న భోజనం వండుతున్న దాదాపు 85 వేల మంది అక్కచెల్లెమ్మల జీవితాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు చెలగాటం ఆడుతున్నారని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. దాదాపు 20 ఏళ్లకు పైబడి పనిచేస్తున్నవారు, వీరిలో చాలామంది ఉన్నారని... ఇప్పుడు, స్మార్ట్ కిచెన్స్ పేరుతో తన పార్టీ వారి పొట్టలు నింపుతూ, అక్కచెల్లెమ్మలను మాత్రం రోడ్డున పడేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగా ఇప్పుడు వారికి ఇవ్వాల్సిన జీతాలు గత రెండు నెలలుగా బకాయిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మధ్యాహ్న భోజనం కార్మికులకు రూ.వేయి ఉండే జీతాన్ని తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ. 3 వేల వరకు పెంచామని జగన్ తెలిపారు. ఎన్నికల తర్వాత అధికారంలోకి వస్తే మరింత మేలు చేస్తామని చెప్పిన చంద్రబాబు... ఇప్పుడు స్మార్ట్ కిచెన్స్ పేరుతో వారిని తొలగించి వారి జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నారని విమర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికుల తరఫున మిగతా .. 2లో..



## అఫ్గానిస్థాన్‌లో భూకంపం..

**ఢిల్లీలోనూ ప్రకంపనలు**

**విశ్వం వాయిస్ న్యూస్ :** అఫ్గానిస్థాన్‌లో భూకంపం సంభవించింది. హిందూకుష్ ప్రాంతంలో శనివారం సాయంత్రం 6.2 తీవ్రతతో భూమి కంపించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. ఈశాన్య అఫ్గాన్‌లోని జుర్మ్‌కు దక్షిణంగా సుమారు 43 కిలోమీటర్ల దూరంలో ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ మిగతా .. 2లో..

### వైకాపా నేతల

## అమరావతి పర్యటన ఉద్రిక్తం




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజధానిలో వైకాపా నేతల పర్యటన ఉద్రిక్తతకు దారితీసింది. ఉండవల్లిలో వైకాపా నేతలను రాజధాని రైతులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. వైకాపా నేతలు గో బ్యాక్ అంటూ పెనుమాక, కృష్ణాయపాలెంలో రైతులు ర్యాలీ నిర్వహించారు. రాజధానిగా అమరావతిని అంగీకరించాకే పర్యటించాలని డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంతంలో రైతుల మధ్య విభేదాలు సృష్టించేందుకు వైకాపా ప్రయత్నిస్తోందని ఆ ప్రాంత వాసులు ఆరోపించారు. ఇందులో భాగంగానే గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నాయకులతో ఆ పార్టీ.. రాజధాని పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేసిందని విమర్శించారు. ఈ కమిటీ శనివారం రాజధాని ప్రాంతంలోని పెనుమాక పర్యటనకు రావడంతో రైతులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో ఉండవల్లి, పెనుమాక ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. వైకాపా నేతలు ప్రకాశం బ్యారేజీ నుంచి ఉండవల్లి వద్దకు రాగానే రైతులంతా వెళ్లి అడ్డుగా నిల్చున్నారు. పేర్ని నాని, లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్ తదితరులపై రైతులు మిగతా .. 2లో..

### సోమవారం శ్రీవాణి

## కరెంట్ బుకింగ్ టికెట్లు రద్దు

**తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి**



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. అధికార యంత్రాంగంతో కలిసి తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి క్యూలైన్లను శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మిగతా .. 2లో..

### ఏపీ ఎయిర్‌పోర్టుల్లో

## మద్యం అమ్మకాలకు గ్రీన్ సిగ్నల్

**ఆధ్యాత్మిక నగరం తిరుపతి ఎయిర్‌పోర్టుకు మినహాయింపు ఇస్తూ ఉత్తర్వులు**

**24 గంటల పాటు బార్లు, వైన్ షాపుల నిర్వహణకు అవకాశం**

**భారీ ఫీజులతో కొత్త ఎక్సైజ్ విధానాన్ని ప్రకటించిన ప్రభుత్వం**

**మూడేళ్ల తర్వాత ఈ విధానంపై సమీక్షించనున్న సర్కార్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లోని విమానాశ్రయాల్లో మద్యం అమ్మకాలకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఎయిర్‌పోర్టుల ప్రాంగణాల్లో బార్లు, వైన్ షాపులు ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తూ శనివారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలోని విమానాశ్రయానికి ఈ ఉత్తర్వుల నుంచి మిగతా .. 2లో..

### ఫేస్‌బుక్ కామెంట్‌కు

## కిడ్నాప్, హత్యాయత్నం

**వైసీపీ నేతలపై హోంమంత్రి అనితకు బాధితుడి ఫిర్యాదు**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫేస్‌బుక్‌లో పెట్టిన ఓ కామెంట్‌కు ప్రతిగా తనను కిడ్నాప్ చేసి, చంపేందుకు ప్రయత్నించారని ఆరోపిస్తూ ఓ బాధితుడు ప్రస్తుత హోంమంత్రి వంగలపూడి అనితకు ఫిర్యాదు చేశారు. వైఎస్ఆర్ కడప జిల్లా రాజంపేట మండలం మన్నూరు గ్రామానికి చెందిన పత్తి మణి, మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో హోంమంత్రితో పాటు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.డి. నజీర్‌కు తన గోడును విన్నవించారు. బాధితుడు పత్తి మణి తెలిపిన వివరాల ప్రకారం, 2023 జూన్ 9న నాటి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు అభినయ్ రెడ్డి, "నారా లోకేశ్, పవన్ కల్యాణ్‌లను తిరుపతిలో అడుగుపెట్టనివ్వం" అని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన తాను.. "ఇది రాచరిక పాలన కాదు, మిగతా .. 2లో..


### భాగ్యరాజ్ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని

## సంపాదించుకున్నారు

**భాగ్యరాజ్ మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన పవన్ కల్యాణ్**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ చలనచిత్ర పరిశ్రమలో, ముఖ్యంగా కోలీవుడ్‌లో ఒక అద్భుతమైన శకం ముగిసింది. తన విలక్షణమైన స్క్రీన్‌ప్లే మ్యాజిక్‌తో దశాబ్దాల పాటు ప్రేక్షకులను అలరించిన ప్రముఖ దర్శకుడు, నటుడు, రచయిత కె.భాగ్యరాజ్ ఈ ఉదయం చెన్నైలో కన్నుమూశారు. ఆయన మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. భాగ్యరాజ్ గారు కేవలం దర్శకుడే కాదు... 'స్క్రీన్‌ప్లే కింగ్'గా ఇండియన్ సినిమాలో చెరగని ముద్ర వేశారని పవన్ కల్యాణ్ గుర్తుచేసుకున్నారు. ఒక సాధారణ సహాయ నటుడిగా, రచయితగా సినీ ప్రస్థానం ప్రారంభించిన భాగ్యరాజ్.. ఆ తర్వాత మిగతా .. 2లో..




## ఆ తండ్రి గుండె మళ్లీ కొట్టుకుంది

**వెనెజువెలా విలయంలో 18 రోజుల మృత్యుంజయురాలు**



**విశ్వం వాయిస్ న్యూస్ :** కొన్ని సెకన్ల విలయం ఎన్నో కుటుంబాల భవిష్యత్తును చిదిమేసింది. అదే సమయంలో.. ఓ కన్నతండ్రి గుండె మాత్రం మళ్లీ కొట్టుకుంది. తల్లి కౌగిలి లేకపోతే క్షణం మిగతా .. 2లో..

### హర్మూజ్‌లో

## మరో ట్యాంకర్‌పై క్షిపణి దాడి



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇరాన్‌ల ప్రతీకార దాడులతో హర్మూజ్‌లో మరోసారి ఉద్రిక్తతలు నెలకొంటున్నాయి. తాజాగా జలసంధిలో ప్రయాణిస్తున్న ఓ ట్యాంకర్‌ను క్షిపణి తాకినట్లు మిగతా .. 2లో..

## భారత పర్యటనకు ట్రంప్

**త్వరలో ఖరారు కానున్న ట్రేడ్ డీల్**



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌లో పర్యటించనున్నారు. వచ్చే ఏడాదిలో ఆయన పర్యటన ఉండే మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## నేనే అందరికంటే పెద్ద జెన్ జీ

అమలు చేస్తాం. యోగా, ధ్యానం వంటి మంచి అలవాట్లతో మీ ఆరోగ్యం.. మీ చేతుల్లోనే ఉంటుంది. పిల్లలకు పౌష్టికాహారం పెట్టాలి.. తాజా ఆహారం తీసుకోవాలి. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. వీలైనంత వరకు ఎరువులు తక్కువగా వాడాలి. యూరియా ఎక్కువ వేస్తే పంటను కొనేందుకు సిద్ధంగా లేరు. చాలా మంది ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేస్తున్నారు. రాష్ట్రంలో 20 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారు. భవిష్యత్‌లో పెద్ద కుటుంబాలను ఆదరిస్తాం. ఇంటి కోసం, రేషన్ కార్డు కోసం పిల్లలు, తల్లిదండ్రుల నుంచి విడిపోతున్నారు. చాలా దేశాల్లో జనాభా తగ్గిపోతోంది. జనాభా పెరగాల్సిన అవసరం ఉంది. 40 ఏళ్ల తర్వాత ఏం జరుగుతుందో దాని గురించి ఇప్పుడే ఆలోచిస్తాను. నా కంటే ఇన్నోవేషన్ తెచ్చేవారు ఎవరూ ఉండరు. ఇటీవల జెన్ జీ... జెన్ జీ మాట ఎక్కువగా వినిపిస్తోంది. నేనే అందరికంటే పెద్ద జెన్‌జీని. నా కంటే ఇన్నోవేటివ్‌గా ఆలోచించేవారు ఎవరూ ఉండరు. ఇన్నోవేషన్‌తో ముందుకు వస్తే అండగా ఉంటా. పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి. వెలిగొండ ప్రాజెక్టు.. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు జీవనాడి. ఈ రెండు ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం. గొడ్డలి పార్టీకి మద్దతు ఇచ్చేవారు ఆత్మవిమర్శ చేసుకోవాలి. అమరావతిపై వైకాపా కుట్రలు జరుగుతూనే ఉన్నాయి. అమరావతిని నంబర్ 1 నగరంగా, రాజధానిగా తీర్చిదిద్దుతాం. అమరావతి మా రాజధాని అని కాలర్ ఎగరేసి చెప్పుకొనేలా నిర్మిస్తాం"అని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ.. "గొడ్డలి పార్టీ ముందు అమరావతిని అంగీకరించి, ఆ తర్వాత మూడు ముక్కల ఆట ఆడింది. ఐదేళ్ల పాటు అభివృద్ధిని ఆమడ దూరం పెట్టింది" అని అన్నారు. అమరావతిపై చట్టం అయిపోయాక కూడా 'మావిగన్' అంటూ పట్టుకుని వేలాడుతున్నారని, ప్రజలు ఛీ కొడుతున్నా బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైసీపీ క్రిమినల్ రాజకీయాలతో సమాజానికి, ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపైనా సీఎం మాట్లాడారు. అన్నదాత పథకం కింద మొదటి విడత నిధులు విడుదల చేశామని, వచ్చే నెలలో 'తల్లికి వందనం' నిధులను తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. వ్యవసాయంలో విచ్చలవిడి ఎరువుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి సేద్యం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలని రైతులకు పిలుపునిచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వరకు మొత్తం ఆరోగ్య వ్యవస్థను ఒకే డిజిటల్ వేదికపైకి తెస్తామన్నారు. సంజీవని కార్డు ద్వారా డాక్టర్ అపాయింట్‌మెంట్, వర్చువల్ వైద్య సేవలు, ఆరోగ్య పర్యవేక్షణ సులభతరం అవుతాయని వివరించారు. ప్రజలు కూడా మంచి ఆహారపు అలవాట్లు, యోగా, వ్యాయామంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

## పవన్‌కు కులం రంగు పులిమారు

చేయడానికే అక్కడికి వెళ్లారని, రాజధాని నిర్మాణాన్ని అడ్డుకునేందుకే రైతులను రెచ్చగొడుతున్నారని చంద్రబాబు ఆరోపించారు. "గొడ్డలి పార్టీ నిరంతరం కుట్రలు చేస్తూనే ఉంది. బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లు రాబందుల్లా వేచి ఉన్నాయి. రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత ఆ పార్టీకి లేదు. దేవాలయాలపై దాడులు చేసిన వాళ్లే ఇప్పుడు గుళ్లకు వెళ్లి నాటకాలు ఆడుతున్నారు. వాళ్లవి పూర్తిగా క్రిమినల్ పాలిటిక్స్. ఇలాంటి వ్యక్తులతో ఆడబిడ్డలకు, సమాజానికి రక్షణ లేదు. వారు చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని బాగు చేయడానికి సుదీర్ఘ సమయం పడుతోంది" అని అన్నారు. గత పాలనలో రూ.10 లక్షల కోట్ల అప్పులు, వ్యవస్థల విధ్వంసంతో రాష్ట్రం నలిగిపోయిందని, ఇప్పుడు బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత కూడా తనపైనే ఉందని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పునరావాసం కింద రైతులకు రూ.300 కోట్లు అందించామని, త్వరలోనే మరో రూ.600 కోట్లు విడుదల చేస్తామన్నారు. వెలిగొండతో రెండు దశల్లో 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. "నదుల అనుసంధానమే రాష్ట్రాలకు శ్రీరామరక్ష. గోదావరి నుంచి కావేరి వరకు నీటిని తీసుకెళ్లి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం. ఈ విషయంలో ఎవరికీ కడుపు ఉబ్బరం అవసరం లేదు. రైతు ప్రయోజనాలే ముఖ్యం" అని సీఎం స్పష్టం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, రామాయపట్నం పోర్టును పూర్తి చేసి పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, డీబీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిట్ల దండకమే వైకాపా విధానం

నాయకులుగా నమ్మితే సమాజానికి ఏం సందేశం ఇచ్చినట్టు?" అని పవన్ ప్రశ్నించారు. వైసీపీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం కులాలను వాడుకుంటోందని, తనను విమర్శించడానికి కాపు సామాజికవర్గానికి చెందిన నేతలనే ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. "నన్ను తిట్టేవాళ్లలో ఎక్కువమంది కాపులే. వాళ్ల భుజాలపై తుపాకీ పెట్టి నన్ను కాలుస్తున్నారు. లింగమనేని రమేశ్‌కి రాజ్యసభ ఇస్తే వాళ్లే విమర్శిస్తారు. ఈ కుట్రపూరిత రాజకీయాలను బ్రేక్ చేస్తాను కాబట్టే నాపై కొందరికి అంత కోపం" అని పవన్ అన్నారు. తాను ఎప్పుడూ కులం కార్డు వాడి రాజకీయాలు చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయబోనని తేల్చిచెప్పారు. "దేశమే నాకు కులం. కులం అనేది ఒక సామాజిక వాస్తవం, దాన్ని గౌరవిస్తాను. కానీ అది ఇంటి గడప దాటకూడదు. గడప దాటితే మానవత్వం, దేశం మాత్రమే గుర్తుండాలి. నేను కులాల ఐక్యతను కోరుకుంటాను తప్ప, వాటిని రాజకీయ పెట్టుబడిగా మార్చను" అని ఆయన ఉద్ఘాటించారు.

## మార్కెట్‌లోకి 'మేడిన్ ఆంధ్ర' బంగారం

జొన్నగిరి గనుల నుంచి జియో మైసూర్ సంస్థ ఉత్పత్తి చేసిన బంగారు బిస్కెట్లను అమ్మకానికి ఉంచారు. ఈ చారిత్రక ఘట్టంతో కర్నూలు జిల్లా పేరు దేశవ్యాప్తంగా మరోసారి మార్మోగుతోంది. ప్రస్తుతం 50 గ్రాములు, 100 గ్రాములు, 500 గ్రాముల బిస్కెట్ల రూపంలో ఈ బంగారాన్ని విక్రయిస్తున్నారు. ఈ బిస్కెట్లపై ఏపీ మ్యాప్‌తో పాటుగా 'జొన్నగిరి గోల్డ్‌మైన్స్' అనే పేరును ముద్రించారు. బంగారం స్వచ్ఛతను తెలియజేసేలా '999' నంబర్‌ను కూడా వేశారు. ఇది 24 క్యారెట్ల అత్యంత స్వచ్ఛమైన బంగారమని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం 500 గ్రాముల బిస్కెట్ విలువ సుమారు రూ.75 లక్షలకు పైనే ఉంటుందని అంచనా. ప్రస్తుతం కర్నూలులోని షరాఫ్ బజార్లో కొందరు వ్యాపారుల వద్ద ఈ బంగారు బిస్కెట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ నెల 24న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జియో మైసూర్-జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు లాంఛనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలోనే జొన్నగిరి గనుల్లో ఉత్పత్తి అయిన తొలి బంగారాన్ని కర్నూలుకు చెందిన ప్రముఖ బంగారం వ్యాపారులు కామిశెట్టి జగదీశ్, చక్రవర్తి, శ్రీహరిమూర్తి తదితరులు కొనుగోలు చేశారు. సీఎం చేతుల మీదుగా స్వయంగా 'మేడిన్ ఆంధ్ర' బంగారం అందుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. వీరిలో ఓ వ్యాపారి ఇప్పటికే ఒక గోల్డ్ బిస్కెట్‌ను వినియోగదారుడికి విక్రయించినట్లు తెలిపారు. ప్రస్తుతం జొన్నగిరి గనుల నుంచి తొలి విడతగా 100 కిలోల బంగారాన్ని ఉత్పత్తి చేసి విక్రయించినట్లు వ్యాపారులు చెబుతున్నారు. మేడిన్ ఆంధ్ర బంగారం కొనుగోలుకు చాలామంది ఆసక్తి చూపుతున్నప్పటికీ, ప్రస్తుతానికి ఇది పరిమితంగానే మార్కెట్లో ఉంది. అయితే, ఈ బంగారానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి పన్ను రాయితీలు ప్రస్తుతానికి లేవని స్పష్టమైంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారానికి వర్తించే అన్ని పన్నులు, జీఎస్టీతో కలిపి ఈ బిస్కెట్లను విక్రయిస్తున్నారు. ఇక, కర్నూలులో ఒక జ్యువెలరీ క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా ముందుకు వస్తోంది. ఇది కార్యరూపం దాల్చితే, వేలాది మంది స్థానిక స్వర్ణకారులకు, ఇతర కార్మికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మొత్తం మీద జొన్నగిరి బంగారం ఉత్పత్తితో రాయలసీమ ప్రాంతంలో కొత్త పారిశ్రామిక శకం ప్రారంభమైందని చెప్పవచ్చు.

### కరెంట్ బుకింగ్ టికెట్లు రద్దు

మీడియాతో మాట్లాడుతూ.. జూన్ నెలలో పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శించుకున్నట్లు చెప్పారు. "రోజుకు 80 వేల మందికిపైగా దర్శనాలు చేయిస్తున్నాం. ఇవాళ లక్షన్నర మందికిపైగా దర్శనానికి వచ్చి వేచి ఉన్నారు. ఆదివారం కూడా రద్దీ కొనసాగే అవకాశం ఉంది. మరోవైపు సోమవారం నాటి శ్రీవాణి కరెంట్ బుకింగ్ టికెట్లు, వీఐపీ సిఫార్సు లేఖలపై ఇచ్చే దర్శనాలు రద్దు చేశాం. భక్తులకు సేవలందిస్తూ భద్రతను పర్యవేక్షిస్తున్నాం" అని వెంకయ్య చౌదరి తెలిపారు.

### సీఎం చెలగాటం ఆడుతున్నారు

పోరాడుతామని, వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే బకాయిపెట్టిన వారి జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. ఇచ్చిన మాట మేరకు వారి జీతాలను కూడా పెంచాలని అన్నారు.

### అఫ్గానిస్థాన్‌లో భూకంపం..


సర్వే పేర్కొంది. అయితే, ఇది 215 కి.మీ లోతులో సంభవించడంతో ఉపరితలంపై దీని ప్రభావం తక్కువగానే ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు, ఇదే సమయంలో భారత్, పాకిస్థాన్, చైనా, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, కిర్గిజ్‌స్థాన్‌లోనూ పలుచోట్ల ప్రకంపనలు సంభవించాయి. దీని ప్రభావంతో జమ్మూకశ్మీర్ సహా దిల్లీ పరిసర ప్రాంతాల్లోనూ ప్రకంపనలు వచ్చాయి. భూ ప్రకంపనలతో కశ్మీర్ లోయ ప్రజలు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. అయితే, ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఘటనలు నమోదు కాలేదని స్థానిక అధికారులు వెల్లడించారు.

### అమరావతి పర్యటన ఉద్రిక్తం

తిరుగుబడ్డారు. మూడు రాజధానుల పేరుతో ఐదేళ్ల పాటు కాలయాపన చేసి, అమరావతిని విధ్వంసం చేసిన వైకాపా నేతలకు రాజధాని గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులు .. అధికారం పోయాక మావిగన్ అని గందరగోళం చేసే చర్యలు మానుకోవాలని హితవు పలికారు. రాజధానిగా అమరావతిని అంగీకరించిన తర్వాత మాత్రమే ఇక్కడ అడుగు పెట్టాలని స్పష్టం చేశారు. రైతులను తోసుకుంటూ వైకాపా నేతలు ముందుకువెళ్లేందుకు ప్రయత్నించగా.. ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఓ దశలో రాళ్లు విసురుకున్నారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితి చక్కదిద్దారు. రైతులను, వైకాపా నేతలను చెరో వైపునకు పంపించారు. రైతులు వైకాపా నేతల వెంటపడటంతో పోలీసులు వారిని నిలువరించారు. వైకాపా నేతలు వెళ్లిపోవాలని.. లేకపోతే ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉందని చెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు. రాళ్ల దాడిలో ఓ కానిస్టేబుల్ గాయాలైనట్లు సమాచారం.

# రూపం వర్తమానం.. గుణం నిత్యనూతనం!

నేడు మనం జీవిస్తున్న ఆధునిక సమాజం ఒక మెరిసే అద్దం వంటిది. ఆ అద్దంలో కేవలం బాహ్య రూపురేఖలు, ధరించిన బ్రాండెడ్ దుస్తులు, చేతికున్న ఖరీదైన గడియారం మాత్రమే కనిపిస్తాయి. కానీ, ఆ అద్దానికి అవతల ఉన్న మనిషి లోపలి అంతరంగం, అతని ఆలోచనల ఉన్నతి, గుణాల గొప్పతనం ఎవరికీ కనిపించవు. ఒక వ్యక్తి ఎంత నిస్వార్థంగా ఆలోచిస్తున్నాడు, ఎంత నిజాయితీగా బతుకు ఈదుతున్నాడు, ఎంత ప్రేమతో ఇతరుల కన్నీళ్లు తుడుస్తున్నాడు అనే విషయాలను నేటి సమాజం అస్సలు పట్టించుకోవడం లేదు. అది కేవలం మనిషి రంగు, రూపం, ఆర్థిక హోదా, సామాజిక స్థాయిని మాత్రమే కొలమానాలుగా తీసుకుంటోంది. ఈ మానసిక వైకల్యమే నేటి ఆధునిక సమాజపు అతి పెద్ద విషాదం.ప్రాచీన కాలం నుండి మన తెలుగు సాంస్కృతిక జీవన విధానం మనసే ఒక మహా దేవాలయం అని ఎలుగెత్తి చాటింది. నాటి తిరుపతి వేంకటకవుల ప్రౌఢ కావ్యాలు మాత్రమే కాదు, సామాన్యుడి నాలుకపై నడిచే వేమన పద్యాలు నేటికీ చిరస్మరణీయంగా నిలిచాయంటే దానికి కారణం అవి మనసు యొక్క అంతర్గత సౌందర్యాన్ని ప్రబోధించడమే. మనసు లేని మనిషి మానవుడు కానే కాడు అని వేమన ఆనాడే కుండబద్దలు కొట్టినట్లు చెప్పాడు. కానీ దురదృష్టవశాత్తూ, ఈరోజు ఆ వేమన సూక్తులను కేవలం పాఠశాలల తెలుగు పరీక్షల్లో మార్కుల కోసం మాత్రమే చదువుతున్నాం. వాటిని జీవితంలో అనుభవించి, ఆచరించడం పూర్తిగా మరచిపోయాం.మన నిత్య జీవితంలో పెళ్లిళ్ల ముచ్చట్లను ఒక్కసారి గమనిస్తే ఈ సామాజిక రుగ్మత స్పష్టంగా అర్థమవుతుంది. సంబంధాలు చూసేటప్పుడు అందరూ మొదట అడిగేది అమ్మాయి రంగు ఎంత, అబ్బాయి జీతం ఎంత అని మాత్రమే. ఆ తర్వాత ఆర్థిక స్థితిగతులు, ఆపై జాతకాలు లెక్కిస్తారు. కానీ, పెళ్లాడబోయే వ్యక్తి స్వభావం ఎలాంటిది, ఆమెకు లేదా అతనికి సమాజం పట్ల ఉన్న సేవా గుణం ఎలాంటిది అని ఆరా తీసేవారు ఎంతమంది? చాలా అరుదు. నేటి విద్యావంతులైన యువతరానికి ఈ ధోరణి తీవ్రమైన మానసిక వేదనను కలిగిస్తోంది. తమ మనసులోని నిజమైన మంచితనాన్ని, ప్రతిభను ఎవరూ గుర్తించడం లేదని వారు తీవ్ర నిరాశలో మునిగిపోతున్నారు.డిజిటల్ యుగంలో, సోషల్ మీడియా విస్తరించిన ఈ రోజుల్లో ఈ రోగం మరింత తీవ్రరూపం దాల్చింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో ఒక కృత్రిమమైన అందమైన రూపానికి, ఫిల్టర్లు అద్దిన ఛాయాచిత్రానికి వేలాది లైక్ లు, కామెంట్లు క్షణాల్లో వచ్చిపడతాయి. అదే సమయంలో సమాజంలో ఒక అనాథకు సహాయం చేసినా, ఒక నిజాయితీ గల చేదు నిజాన్ని పంచుకున్నా ఆ స్థాయిలో స్పందన లభించదు. ఒక అర్థం లేని రీల్స్ లేదా వీడియో రాత్రికి రాత్రే వైరల్ అవుతుంది కానీ, సమాజాన్ని మేల్కొలిపే ఒక గొప్ప ఆలోచన మాత్రం చీకటిలోనే మగ్గిపోతుంది. ఈ గందరగోళ పరిస్థితిలో మనం కాస్త ఆగి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మనం అసలు ఏ విలువలను సామాజిక వేదికలపై నిలబెడుతున్నాం?నగరాల మెరుపుల్లోనైనా, పల్లెల పచ్చదనంలోనైనా అన్ని చోట్లా ఇంచుమించు ఇదే దృశ్యం ఆవిష్కృతమవుతోంది. ఒక వ్యక్తి పేదరికంలో ఉన్నా, బాహ్య రూపంలో సాదాసీదాగా కనిపించినా అతనిలో ఉన్న అపారమైన జ్ఞానాన్ని, నిస్వార్థమైన దయను ఈ సమాజం పూర్తిగా విస్మరిస్తుంది. అదే వ్యక్తి విదేశాల నుండి ఒక డిగ్రీ తెచ్చుకుంటేనో, లేదా అడ్డదారుల్లోనైనా కోట్ల రూపాయలు సంపాదిస్తేనో, అప్పుడు ఇదే సమాజం కాళ్లపై పడి వంగి వంగి సలాం చేస్తుంది. ఈ వికృత భేదభావం ఎందుకు వస్తోంది?మన పిల్లల పెంపకంలోనూ ఇదే ప్రాథమిక పొరపాటు నిరంతరం జరుగుతోంది. ఇళ్లలో పెద్దలు పిల్లలను ఉద్దేశించి నువ్వు చాలా పొడవుగా ఉన్నావు ,నువ్వు చాలా తెల్లగా అందంగా ఉన్నావు అని బాహ్య రూపాలనే పొగుడుతుంటారు. కానీ, నువ్వు ఈరోజు చాలా నిజాయితీగా మాట్లాడావు ,నీ స్నేహితుడికి ఎంతో చక్కగా సాయం చేశావు అని వారి అంతర్గత గుణాలను అభినందించడం చాలా అరుదు. దీనివల్ల బాల్యం నుంచే పిల్లల మనస్సుల్లో రూపమే అన్నింటికన్నా గొప్పదనే తప్పుడు సంకేతాలు బలంగా నాటుకుపోతున్నాయి. ఇతరుల కష్టాలను, బాధలను చూసి కరగిపోయే ఆర్ద్ర హృదయమే నిజమైన మానవత్వానికి నిదర్శనం. విజయం లభించినప్పుడు వినమ్రతతో, వైఫల్యం ఎదురైనప్పుడు గుండె నిబ్బరంతో ధైర్యంగా నిలబడటమే ఉన్నత స్వభావం. ఎదుటి వారి ఆవేదనను, మాటలను ఎలాంటి ముందస్తు అంచనాలు లేకుండా వినే ఓర్పు నిజమైన బుద్ధిమంతుని లక్షణం.ఎలాంటి పేరు ప్రఖ్యాతులు, క్రెడిట్ ఆశించకుండా గుప్తంగా చేసే సేవయే మహోన్నతమైన దైవ గుణం.బాహ్య రూపంలో కాదు, మనిషి చేసే నిత్య కృత్యాలలోనే అతని అసలైన వ్యక్తిత్వం ప్రతిబింబిస్తుంది. ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన గొప్ప నాయకులను పరిశీలిస్తే మహాత్మా గాంధీ సాదాసీదా నూలు బట్టలు ధరించారు, బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవితాంతం సామాజిక వివక్షను ఎదుర్కొని పోరాడారు, శ్రీరామకృష్ణ పరమహంస అత్యంత సాధారణ వస్త్రధారణతో గడిపారు. నేడు ప్రపంచం వారిని పూజిస్తోందంటే అది వారి రూప సౌందర్యానికి కాదు; వారి మనసు యొక్క విశాలత్వానికి, వారి ఆలోచనల లోతుకు, వారు యావత్ మానవాళికి ప్రసాదించిన వైజ్ఞానిక వెలుతురుకు మాత్రమే. కానీ నేడు ఆ మహనీయుల వారసులమని చెప్పుకునే మనం, వారి ఆదర్శాలను గాలికొదిలేసి కేవలం రూపానికి దాసులమైపోవడం సిగ్గుచేటు.ఇప్పుడు మన సామాజిక వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పు రావాలంటే, ఆ మార్పు మొదట ప్రతి ఒక్కరి ఇల్లు , గుమ్మం నుండి ప్రారంభం కావాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు మీ రంగు అందంగా ఉంది అని కాకుండా, మీ సంస్కారం, మనసు అందంగా ఉన్నాయి అని నేర్పించాలి. పాఠశాలల్లో ఉపాధ్యాయులు కేవలం మార్కుల ప్రగతికే కాకుండా, విద్యార్థుల ఉత్తమ ప్రవర్తనకు, క్రమశిక్షణకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి. సమాజం సైతం ఒక సామాన్య పేద కార్మికుడి శ్రమలో ఉన్న పవిత్రతను, అతనిలోని మహత్తరమైన మనసును గౌరవించడం నేర్చుకోవాలి.ఇది కేవలం ఒక పత్రికా వ్యాసం మాత్రమే కాదు; ప్రతి ఒక్కరి అంతరాత్మను తట్టి లేపే ఒక సామాజిక పిలుపు. మన ఇంట్లో, మన నిత్య సంభాషణల్లో, మన చర్యల్లో మనం రూపానికి కాకుండా గుణానికి, మనసుకు గుర్తింపు ఇవ్వడం మొదలుపెట్టినప్పుడు మాత్రమే సమాజంలో ఆశించిన మార్పు వస్తుంది. ఒక మనిషి హృదయంలో ఎంతటి సద్గుణాల వెలుతురు ఉందో మనం ఎప్పుడైతే స్పష్టంగా చూడగలుగుతామో, అప్పుడే మనం నిజమైన నాగరికులుగా చలామణి కావడానికి అర్హులమవుతాం.ఒక్కసారి మీ హృదయంపై చేయి వేసుకుని ఆలోచించండి మీ జీవితంలో అత్యంత క్లిష్టసమయంలో మీకు నిజంగా అండగా నిలబడి సహాయపడిన వ్యక్తి అపరంజి రూపసా? లేక ఆర్ద్రత కలిగిన మనసున్న సాదాసీదా వ్యక్యా? మీకు జీవితంలో నిజమైన మానసిక ఆనందం ఎక్కడ లభించింది ఒక అందమైన వ్యక్తి కృత్రిమ తోడులోనా? లేక ఒక నిష్కల్మషమైన నిజమైన హృదయం అండలోనా? మీ అంతరాత్మ ఇచ్చే సమాధానమే ఈ వ్యాసానికి అసలైన, సంపూర్ణమైన ముగింపు.సమాజం ఇకనైనా బాహ్య రూపాన్ని చూసి మోసపోవడం ఆపాలి. మనిషి లోపలి అంతరంగాన్ని చదవడం అలవాటు చేసుకోవాలి. ఆ వైఖరిలోని మార్పు ఇతరుల నుండి కాదు, మొదట మనతోనే, ఈ క్షణమే ప్రారంభం కావాలి. లోకంలో ప్రతి ఒక్కరూ బాహ్య సౌందర్యాన్ని పక్కనబెట్టి, తోటి మనిషి మనసుకు గుర్తింపు ఇచ్చిన రోజున, ఈ సమాజం మరింత మానవీయంగా, పరమ పవిత్రంగా మరియు అత్యంత అందంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు మానవత్వం అంటే కేవలం ఆకర్షణీయమైన రూపం కాదు అది పవిత్రమైన మనసు. సేవ అంటే సమాజానికి కనిపించేలా చేసే ప్రదర్శన కాదు అది ఎవరికీ కనిపించని హృదయ స్పందన. సమాజం ఈ పరమ సత్యాన్ని నగ్నంగా గుర్తించినప్పుడే, మనం అనుభవిస్తున్న ఈ నాగరికత అనే మాటకు నిజమైన సార్థకత, పరమార్థం లభిస్తాయి. మనం ‿న్న మనిషి అంత రంగాన్ని ఆవిష్కరిం చే ఈ ప్రత్యేక వ్యాసం సమాజం పట్ల బాధ్యత కలిగిన మనసున్న పాఠ కులందరికీ సప్రేమ అంకితం.



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ,
9490754169

### మద్యం అమ్మకాలకు గ్రీన్ సిగ్నల్

మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వం జారీ చేసిన కొత్త మార్గదర్శకాల ప్రకారం, విమానాశ్రయాల్లోని బార్లు, వైన్ షాపులు 24 గంటలూ పనిచేసేందుకు అనుమతి కల్పించారు. ఈ కొత్త విధానంలో భాగంగా ప్రభుత్వం లైసెన్స్ ఫీజులు, ఎక్సైజ్ సుంకాన్ని కూడా ఖరారు చేసింది. ఎయిర్‌పోర్టుల్లో బార్ లైసెన్స్ కోసం దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు, వైన్ షాపు కోసం దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుగా నిర్ణయించారు. ఇక ఎక్సైజ్ సుంకం విషయానికొస్తే, విమానాశ్రయంలోని వైన్ షాపుకు ఏటా రూ.2 కోట్లుగా నిర్ణయించారు. బార్లకు ప్రయాణికుల రద్దీ ఆధారంగా ఎక్సైజ్ సుంకాన్ని రెండు రకాలుగా విభజించారు. ఏడాదికి 20 లక్షలకు పైగా ప్రయాణికుల రాకపోకలు ఉన్న విమానాశ్రయాల్లోని బార్లకు రూ.25 లక్షలు, 20 లక్షల లోపు ప్రయాణికులు ఉన్నచోట రూ.15 లక్షలుగా ఎక్సైజ్ సుంకాన్ని నిర్ధారించారు. ఈ కొత్త ఎక్సైజ్ విధానాన్ని మూడేళ్ల తర్వాత సమీక్షించనున్నట్లు ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

### కిడ్నాప్, హత్యాయత్నం

ప్రజాస్వామ్యం. ఎవరైనా ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చు... మీరు నందలూరు నుంచి తిరుపతి వెళ్లలేదా?" అని కామెంట్ పెట్టినట్టు వెల్లడించారు. ఈ కామెంట్‌ను మనసులో పెట్టుకున్న భూమన అనుచరుడు రాజు మరికొందరితో కలిసి జూన్ 11న రాజంపేటలోని హరిత హోటల్ వద్ద తనపై దాడి చేసి, బలవంతంగా కారులో కిడ్నాప్ చేశారని మణి ఆరోపించారు. కారులోనే తన నాలుక కోసి, చేతి నరాలు కట్ చేసి, కళ్లపై రాళ్లతో కొట్టి చంపేందుకు ప్రయత్నించారని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి చేస్తున్న సమయంలో నిందితులు నాటి ఎమ్మెల్యే భూమనకు, ఆయన కుమారుడికి వీడియో కాల్ చేసి చూపించగా.. అవతలి నుంచి "వీడిని బాగా కొట్టి, చంపేసి అలిపిరి అడవిలో పారేయండి" అని ఆదేశాలు ఇచ్చారని మణి సంచలన ఆరోపణలు చేశారు. అయితే, పోలీసులు తమను వెతుకుతున్నారని తెలిసి నిందితులు పరారయ్యేందుకు ప్రయత్నించగా, చిట్వేలి వద్ద పోలీసులు వారిని పట్టుకుని తనను రక్షించారని తెలిపారు. అయితే అసలు కథ ఇక్కడే మొదలైందని, నిందితులను మన్నూరు పోలీస్ స్టేషన్‌కు తరలించగానే నాటి వైసీపీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డి డీఎస్పీకి ఫోన్ చేశారని, దీంతో నిందితులకు వెంటనే స్టేషన్ బెయిల్ ఇచ్చి, రాత్రి 2 గంటలకు పోలీస్ సెక్యూరిటీతో తిరుపతికి పంపించేశారని మణి ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తర్వాత, చావుబతుకుల మధ్య ఉన్న తనపైనే పోలీసులు అక్రమ కేసులు పెట్టారని, తన భార్యను, 3 ఏళ్ల కుమారుడిని పోలీస్ స్టేషన్‌లో 4 గంటల పాటు అక్రమంగా నిర్బంధించారని వాపోయారు. ఈ అన్యాయంపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆయన హోంమంత్రిని కోరారు.

## సంపాదించుకున్నారు

తమిళ ఇండస్ట్రీలో టాప్ డైరెక్టర్‌గా, హీరోగా తనదైన ముద్ర వేశారన్నారు. చిత్ర రంగంలో భాగ్యరాజ్ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఆయన కథ, స్క్రీన్‌ప్లే అందించిన ఎన్నో క్లాసిక్ సినిమాలు తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో రీమేక్ అయి విజయాలు అందుకున్నాయని కొనియాడారు. ప్రేమ, మధ్యతరగతి కుటుంబాల ఎమోషన్స్, హ్యూమర్‌ను సరికొత్తగా మిక్స్ చేస్తూ ఆయన సినిమాలు మలిచిన తీరు ఒక తరం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుందని పవన్ అన్నారు. మన పక్కింటి అబ్బాయిలాంటి పాత్రలతోనే ఆయన మెప్పించారన్నారు. ఈ విషాద సమయంలో భాగ్యరాజ్ కుటుంబ సభ్యులకు (భార్య పూర్ణిమ, కుమారుడు శాంతను, కుమార్తె శరణ్య) భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

### ఆ తండ్రి గుండె మళ్లీ కొట్టుకుంది

ఉండలేని పసికందు.. శిథిలాల అడుగున పడిపోయింది. చివరకు సజీవంగా కనిపించి.. వెనెజువెలా పెనువిపత్తులో మృత్యువును జయించింది. ఆ చిన్నారిని బయటకు తీస్తున్నప్పుడు వినిపించిన కేరింతలు ఆ ప్రాంతాన్ని ఉద్విగ్నంగా మార్చాయి. వెనెజువెలాలో బుధవారం సాయంత్రం క్షణాల వ్యవధిలో జంట భూకంపాలు రావడంతో వందల భవనాలు కుప్పకూలాయి. దాంతో వేలాదిమంది శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఓ ప్రాంతంలో 18 రోజుల పసికందు తల్లితో సహా శిథిలాల కింద చిక్కుకుపోయింది. తన భార్య, బిడ్డ అసలు బతికున్నారో లేదో తెలియక వారికోసం వెతుకుతూ తండ్రి తల్లడిల్లాడు. అక్కడ రెస్క్యూ సిబ్బంది ఒక్కో సిమెంట్ దిబ్బను తొలగిస్తుంటే.. ఆ తండ్రి గుండె వేగంగా కొట్టుకోసాగింది. చివరకు ప్రయత్నం ఫలించి రోజుల బిడ్డ ప్రాణాలతో కనిపించింది. ఆ బిడ్డను వస్త్రంలో చుట్టి ఎంతో అపురూపంగా తండ్రికి అందించడంతో ఆయన గుండె మళ్లీ కొట్టుకున్నట్లయింది. చిన్నగాయం లేకుండా పాలకోసం ఎదురుచూస్తున్న ఆ బిడ్డను చూసి ప్రతి ఒక్కరి ముఖాల్లో చిరునవ్వులు కనిపించాయి. ఒకవైపు బిడ్డ దొరికిందన్న ఆనందం.. మరోవైపు భార్య పరిస్థితి ఎలా ఉందో తెలియని పరిస్థితి. చివరకు 90 నిమిషాల తర్వాత ఆ తల్లి కూడా సజీవంగా ఉందన్న వార్త వినిపించింది. దాంతో అతడు ఊపిరి పీల్చుకున్నాడు. ఈ భారీ విపత్తు నుంచి ఆ కుటుంబం బయటపడిన దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

### మరో ట్యాంకర్‌పై క్షిపణి దాడి

యూకే మిలిటరీ వెల్లడించింది. ఆ నౌకకు నష్టం వాటిల్లినప్పటికీ.. సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని పేర్కొంది. అయితే ఆ క్షిపణిని ఎవరు ప్రయోగించారనే విషయంపై స్పష్టత రాలేదు. అమెరికా-ఇరాన్‌లు శాంతి ఒప్పందంపై సంతకాలు చేయడంతో హర్మూజ్‌లో ఇటీవల నౌకాయానం తిరిగి ప్రారంభమైంది. కొన్ని నెలలుగా అక్కడే నిలిచిపోయిన అనేక వాణిజ్య నౌకలు తమ ప్రయాణాన్ని మొదలుపెట్టాయి. ఈ క్రమంలోనే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ అమెరికా, ఇరాన్‌లు దాడులను మొదలుపెట్టాయి. డ్రోన్లు, క్షిపణి దాడులతో జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

### భారత పర్యటనకు ట్రంప్

అవకాశం ఉంది. ఈ విషయాన్ని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. భారత్-అమెరికా మధ్య సంబంధాలు అద్భుతమంటూ కొనియాడారు. అధ్యక్షుడి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఖరారు చేయడానికి ఈ ఏడాది ముగిసేలోపే తాను భారత్‌కు వెళ్తానని పేర్కొన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రంప్ మొదటి భారత పర్యటన ఇదే కానుంది. అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత భాగస్వామి అని.. ప్రధాని నరేంద్ర మోదీ - ట్రంప్ మధ్య మంచి అనుబంధం ఉందని మార్కో రూబియో తెలిపారు. దౌత్యపరంగా వారి బంధం చాలా ఉపయోగకరమన్నారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సులో వాణిజ్య ఒప్పందం గురించి మోదీ-ట్రంప్ చర్చించారని రూబియో వెల్లడించారు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు త్వరలో పూర్తి కానున్నట్లు తెలిపారు. ఇంధన సరఫరాను పెంచడానికి భారత్-అమెరికా కలిసికట్టుగా పనిచేస్తున్నాయన్నారు. చమురు శుద్ధి చేయగల సామర్థ్యం ఉన్న కొన్ని దేశాలలో భారత్ కూడా ఒకటని పేర్కొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## బాధ్యతాయుతమైన పౌరుడే బలమైన దేశానికి పునాది

దేశ అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు మనం ఎక్కువగా ప్రభుత్వాలు, పాలకులు, అధికారులు, రాజకీయ నాయకుల బాధ్యతలను ప్రస్తావిస్తుంటాం. కానీ ఒక దేశం అభివృద్ధి చెందాలంటే కేవలం పాలకుల కృషి మాత్రమే సరిపోదు. ఆ దేశ ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. పౌరుడి బాధ్యతతోనే ప్రజాస్వామ్యం బలపడుతుంది.

మనకు రాజ్యాంగం అనేక హక్కులు కల్పించింది. అదే సమయంలో కొన్ని విధులను కూడా అప్పగించింది. చట్టాలను గౌరవించడం, ప్రజా ఆస్తులను కాపాడడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, పన్నులు నిజాయితీగా చెల్లించడం, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం వంటి బాధ్యతలు ప్రతి పౌరుడిపై ఉన్నాయి. అయితే హక్కుల గురించి మాట్లాడేంతగా విధుల గురించి ఆలోచించే పరిస్థితి కనిపించడం లేదు.

రోడ్డుపై చెత్త వేయకుండా ఉండటం, ట్రాఫిక్ నియమాలు పాటించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు ఇవ్వకుండా సేవలు పొందేందుకు ప్రయత్నించడం, అవినీతి కనిపిస్తే ప్రశ్నించడం, సామాజిక సమస్యలపై స్పందించడం---ఇవన్నీ ఒక మంచి పౌరుడి లక్షణాలు. చిన్న చిన్న బాధ్యతలను నిర్లక్ష్యం చేయడం వల్లే పెద్ద సమస్యలు సమాజాన్ని చుట్టుముడుతున్నాయి.

సాంకేతిక యుగంలో సోషల్ మీడియా ప్రజలకు గొంతుకను ఇచ్చింది. కానీ అదే వేదికలో అసత్య ప్రచారాలు, ద్వేషపూరిత వ్యాఖ్యలు, నిర్ధారణ లేని సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. ప్రతి పౌరుడు సమాచారం పంచుకునే ముందు దాని నిజానిజాలను నిర్ధారించుకోవాలి. బాధ్యతాయుతమైన డిజిటల్ ప్రవర్తన కూడా నేటి కాలంలో ఒక పౌర విధిగా మారింది.

యువత ఈ దేశానికి శక్తి. యువతలో సామాజిక చైతన్యం, నిజాయితీ, సేవాభావం పెరిగితే దేశ భవిష్యత్తు మరింత బలపడుతుంది. విద్య కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా మంచి పౌరుడిగా తీర్చిదిద్దేందుకు కూడా ఉపయోగపడాలి.

ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఓటు వేయడం మాత్రమే కాదు. ప్రతి రోజు సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడం. మార్పు ఎక్కడో ప్రారంభం కాదు. మన ఇంటి గుమ్మం నుంచే ప్రారంభమవుతుంది. ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తిస్తే అవినీతి తగ్గుతుంది, సమాజంలో క్రమశిక్షణ పెరుగుతుంది, అభివృద్ధి వేగవంతమవుతుంది.



దేశాన్ని మార్చాలంటే ముందుగా మనం మారాలి. బాధ్యతాయుతమైన పౌరులే బలమైన భారతదేశాన్ని నిర్మించగలరు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## చేతన్ ప్రేరేపణతోనే కేతన్ తోసివేత

**బాధిత కుటుంబంతో సీఎం భేటీ - ఫాస్ట్‌ట్రాక్ కోర్టు విచారణకు ఆమోదం - స్పెషల్ పీపీగా ఉజ్వల్ నికమ్**



**పుణె, విశ్వం వాయిస్ న్యూస్ :** యువ రియల్టర్ కేతన్ అగర్వాల్ (26) హత్యకేసు విచారణ రోజుకో మలుపు తిరుగుతోంది. పుణె సమీప లోహ్‌గఢ్ కోట వద్ద లోయలోకి తోసి కేతన్‌ను హత్య చేయాలని సియాను ఆమె ప్రియుడు చేతన్ ప్రేరేపించాడని.. లేదంటే అంతకుమునుపు జరిగిన విషయాలను బయటపెడతానని బెదిరించినట్లు పోలీసులు శుక్రవారం వెల్లడించారు. కేతన్ కొండ అంచు వద్దకు చేరుకున్నాక పథకం ప్రకారం.. చేతన్‌కు సియా సంకేతం ఇచ్చిందన్నారు. చేతన్ వెంటనే పైకి చేరుకొని కేతన్‌ను వెనుక నుంచి తోసివేసినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్‌ను ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటరుగా మహారాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ విషయాన్ని సీఎంవో 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. శుక్రవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ పుణెలో కేతన్ తండ్రి విశాల్ అగర్వాల్‌ను కలిశారు. ఈ కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి దోషులకు కఠినశిక్ష విధించాలని ఆయన కోరగా.. సీఎం సానుకూలంగా స్పందించారు. కేతన్ హత్య తర్వాత సియా, చేతన్ తమ ఫోన్ల నుంచి డేటా మొత్తం తొలగించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో వీరిద్దరి ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబుకు పంపారు. నిశ్చితార్థాన్ని రద్దు చేసుకొని పారిపోయి పెళ్లి చేసుకుందామంటే.. కుటుంబ గౌరవం కారణంగా సియా అందుకు అంగీకరించలేదని నిందితుడు చేతన్ పోలీసు విచారణలో తెలిపాడు.

## స్కూల్ బస్సు కింద పడి రెండున్నరేళ్ల బాలుడి మృతి



**భువనగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** యాదాద్రి జిల్లా భువనగిరి మండలం వడపర్తిలో విషాదం చోటు చేసుకుంది. స్కూల్ బస్సు కింద పడి రెండున్నరేళ్ల బాలుడు మృతి చెందాడు. పెద్ద కుమారుడిని దింపేందుకు తల్లి స్కూల్ బస్సు దగ్గరికి వెళ్లింది. అన్న కోసం ఆమె వెనకే బాలుడు కూడా వెళ్లాడు. డ్రైవర్ గమనించకుండా బస్సును ముందుకు తీసేయడంతో టైరు కింద పడి బాలుడు మృతి చెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 20 ఏళ్లుగా దొంగతనాలే వృత్తి.. ఎట్టకేలకు పొట్టి రఫీ అరెస్టు

**రూ.27 లక్షల విలువైన వెండి, బంగారం, నగదు, వాహనాలు స్వాధీనం - 25 నేరాల్లో నిందితుడిగా గుర్తింపు**



పోలీసులు స్వాధీనపరచుకున్న వెండి వస్తువులు, బంగారు ఆభరణాలు

**వినుకొండ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా 25 దొంగతనాలకు పాల్పడి రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న అంతర్రాష్ట్ర దొంగను పల్నాడు జిల్లా వినుకొండ పోలీసులు అరెస్టు చేశారు. వినుకొండ పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం నరసరావుపేట డీఎస్పీ ఎం.హనుమంతరావు నిందితుడి వివరాలు వెల్లడించారు. వినుకొండ మండలం దొండపాడుకు చెందిన షేక్ రఫీ ఎలియాస్ పొట్టి రఫీ (45) 20 ఏళ్లుగా దొంగతనాలే వృత్తిగా జీవనం సాగిస్తున్నాడు. పల్నాడు, గుంటూరు, ప్రకాశం, మార్కాపురం, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. చోరీలకు అనువుగా ఉండే ఇళ్లపై పగటిపూట రెక్కీ నిర్వహించి, రాత్రిళ్లు గోడలకు జాకీతో రంధ్రాలు వేసి లోపలికి ప్రవేశించి దొంగతనం చేసేవాడు. ఇటీవల మార్కాపురం జిల్లా కంభం పట్టణానికి నివాసం మార్చాడు. మే 21న వినుకొండలోని వేక్షిత జ్యువెలర్స్ షాపులో ఏడు కిలోల వెండి వస్తువులను అపహరించాడు. దుకాణ యజమాని వజ్రాల వీరేంద్ర రాహుల్‌రెడ్డి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. సెల్‌ఫోన్ కాల్‌డేటా ఆధారంగా నిందితుడి కదలికలను గుర్తించారు. వినుకొండలోని పసుపులేరు వంతెన వద్ద గురువారం అదుపులోకి తీసుకుని విచారించారు. వినుకొండలో జ్యువెలరీ షాపుతో పాటు పెయింట్, డ్రైఫ్రూట్స్ దుకాణాలు, మరో రెండు చోట్ల దొంగతనం చేసినట్లు రఫీ ఒప్పుకొన్నాడు. వీటితో పాటు ప్రకాశం జిల్లా అద్దంకిలో రూ.లక్ష నగదు, బంగారం, ఆటో, బుల్లెట్, అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కారు దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. వినుకొండ, అద్దంకిలో చోరీ చేసిన సామగ్రిని పోలీసులు స్వాధీనపరచుకున్నారు. వీటిలో ఆటో, బుల్లెట్, రూ.1.70 లక్షల నగదు, ఆరు గ్రాముల బంగారు ఆభరణాలు, 7.257 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. వీటి విలువ రూ.27 లక్షలు అని పోలీసులు వెల్లడించారు. గతంలో 16 చోట్ల దొంగతనాలకు పాల్పడగా కొన్నాళ్లు జైల్లో ఉండి బయటకొచ్చి మళ్లీ చోరీలకు పాల్పడుతున్నాడని తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన సీఐ ప్రభాకర్‌ను డీఎస్పీ అభినందించారు. సీఐకి సహకరించిన కానిస్టేబుళ్లు సునీల్‌బాబు, అశోక్‌బాబు, లక్ష్మణరావు, జయరాంకు నగదు బహుమతులు అందజేశారు.

## ఒంగోలు నగరపాలక సంస్థపై ఏసీబీ పంజా

**13 మంది టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఇళ్లలో సోదాలు**



**ఒంగోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకాశం జిల్లా ఒంగోలు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్ రసూల్‌తోపాటు మరో 12 మంది ఉద్యోగుల ఇళ్లలో అవినీతి నిరోధక శాఖ(అనిశా) ఏకకాలంలో దాడులు చేపట్టింది. గురువారం తెల్లవారుజామునే ఏసీబీ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఉద్యోగుల ఇళ్లలో తనిఖీలకు ఉపక్రమించారు. ఈ ఏడాది మార్చి 9, 10వ తేదీల్లో ఒంగోలు నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అనిశా ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ పథకం(బీపీఎస్)లో భారీగా అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణల నేపథ్యంలో అప్పట్లో ఈ సోదాలు జరిగాయి. ఆ సమయంలో కొందరు సిబ్బంది తమ వద్ద ఉన్న డబ్బును కిటికీల నుంచి బయటకు విసిరేయడం చర్చనీయాంశంగా మారింది. సిబ్బంది నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లలో ఫోన్‌పే ద్వారా పెద్ద ఎత్తున బీపీఎస్ దరఖాస్తుదారుల నుంచి డబ్బులు తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నట్లు అనిశా అధికారులు గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. తదుపరి చర్యలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో ఏసీబీ జిల్లా ఇన్‌ఛార్జి డీఎస్పీ రామకృష్ణుడు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. నెల్లూరు, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి తొమ్మిది మంది సీఐలు, ఎస్సైలతో కూడిన బృందాలు ఒంగోలులోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాయి. గురువారం రాత్రిదాకా సోదాలు కొనసాగాయి.

### తహసీల్దార్ సుచరితపై
## ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

**రూ.5.05 కోట్ల అక్రమ ఆస్తుల గుర్తింపు**






**సోదాల్లో స్వాధీనం చేసుకున్న వజ్రాలు, నగదు**

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు ఏకంగా రూ.30 లక్షలు లంచం డిమాండు చేసిన శామీర్‌పేట తహసీల్దార్ తుమ్మకొమ్మ సుచరితపై అవినీతి నిరోధకశాఖ(అనిశా) ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. ఆమెతో పాటు ఆమె బంధువుల ఇళ్లలో నిర్వహించిన సోదాల్లో అధికారిక లెక్కల ప్రకారం రూ.5,05,52,465 విలువైన ఆస్తులు గుర్తించారు. బహిరంగ మార్కెట్లో వీటి విలువ రూ.50 కోట్లకుపైగానే ఉంటుందని అంచనా వేశారు. రూ.30 లక్షలు లంచం డిమాండు చేసి రూ.2 లక్షలు తీసుకుంటుండగా గత నెల 26న అనిశా అధికారులు ఆమెను పట్టుకున్నారు. ప్రస్తుతం రిమాండులో ఉన్నారు. తదుపరి దర్యాప్తులో భాగంగా గురువారం నిర్వహించిన సోదాల్లో సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం దామరకుంటలో 2.17 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లో మూడు ఫ్లాట్లు, కీసర, ఖానామెట్‌లలో రెండు ఇంటి స్థలాలు గుర్తించారు. దీంతోపాటు రూ.12 లక్షల నగదు, రెండు కార్లు, రూ.1.20 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాలు, రూ.38 లక్షల బ్యాంకు బ్యాలెన్సు గుర్తించారు. వీటి విలువ రూ.5.05 కోట్లుగా లెక్కగట్టారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

## ఓటరు దరఖాస్తుతో ఓటును పరిశీలించుకోవాలి

**ఇంటింటికీ వెళ్లి అవగాహన నిర్వహిస్తున్న కుడుపూడి సత్తిబాబు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు శనివారం ఉదయం నగరంలోని 3వ వార్డు పరిధిలోని 127,128,129, 130,131 పోలింగ్ బూత్‌ల పరిధిలో స్థానిక టిడిపి కార్యకర్తలతో పాటు విస్తృతంగా ఇంటింటికీ పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే ఉద్దేశంతో రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నగరంలోని అన్ని వార్డుల్లో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారని కుడుపూడి సత్తిబాబు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక బూత్ లెవల్ అధికారులు తో మాట్లాడి ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం పురోగతిని తెలుసుకున్నారు. ఓటరు నమోదు, పేరు సవరణ, చిరునామా మార్పు, ఇతర వివరాలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు నింపడంలో సందేహాలు వ్యక్తం చేసిన ఓటర్లకు స్వయంగా దగ్గరుండి వివరించి, సరైన విధంగా దరఖాస్తులు పూర్తి చేసుకునేలా మార్గనిర్దేశం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం సూచించిన గడువులోపు దరఖాస్తులు సమర్పించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆయన కోరారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికల అధికారులు, బీఎల్‌ఓలతో సమన్వయం చేస్తూ అవసరమైన సహకారం అందిస్తున్నామని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఓటు విలువైనదని, అందువల్ల ప్రతి కుటుంబం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని కుడుపూడి సత్తిబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక పుల్లమ్మ, దేవి, రమాదేవి, నాగదేవి, సత్యవతి మరియు స్థానిక పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### సాధన హోమ్ పిల్లలకు
## విద్యా సామాగ్రి పంపిణీ

**ఎం.పి.డి.ఓ.ఎం. భారతి**




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పురుషోత్తపట్నంలోని సాధన మహిళా మండలి 'చిల్డ్రన్ హోమ్' (సాధన హోమ్) ఆవరణలో శనివారం విద్యార్థులకు ఉచిత విద్యా సామాగ్రి పంపిణీ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీతానగరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఎం. భారతి హాజరై, తన చేతుల మీదుగా పిల్లలకు విద్యా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఎం.పి.డి.ఓ. భారతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలోనూ విద్యే అత్యంత కీలకమైనదని, చదువు ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చని పిల్లలకు మార్గదర్శనం చేశారు. సాధన మహిళా మండలి చైర్‌పర్సన్ పి. సుజ్ఞాన కుమారి మాట్లాడుతూ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న పిల్లలతో పాటు డే-స్కాలర్స్ అయిన సుమారు 60 మంది విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, పుస్తకాలు, నోటు పుస్తకాలు, రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లు, వాటర్ బాటిళ్లు, జామెట్రీ బాక్సులు మరియు ఇతర అవసరమైన సామాగ్రిని ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధన మహిళా మండలి చీఫ్ అడ్వైజర్ పి. వెంకట రత్నం, మీడియా కో-ఆర్డినేటర్ పి. రాజీవ్ కుమార్, సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ భవనంలో యోగా శిక్షణా కేంద్రం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక తూర్పుగోదావరి జిల్లా రెడ్ క్రాస్ భవనంలో జులై మొదటి వారంలో యోగా శిక్షణ కేంద్రం ప్రారంభిస్తామని ఇండియన్ రెడ్ క్రాస్ తూర్పుగోదావరి జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ కె.వి రమణ మరియు కోశాధికారి జి మహాలక్ష్మిలు తెలియజేశారు. శనివారం రెడ్ క్రాస్ భవనంలో ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ రమణ,కోశాధికారి డాక్టర్ జి మహాలక్ష్మిలు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగములో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని కేవలం యోగ,ధ్యానం, ఆహారపు అలవాట్లు మాత్రమే మనిషి ఆరోగ్యాన్ని కాపాడతాయని తెలియజేస్తూ ప్రతి ఒక్కరు కూడా యోగా నేర్చుకోవాలని ప్రముఖ యోగా గురువు ఎన్ఎన్వి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో యోగా శిక్షణ ప్రారంభిస్తున్నట్టు తెలియజేశారు. ఆసక్తిగల స్త్రీ పురుషులు ఎంఆర్ఓ ఆఫీస్ పక్క వీధిలో ఉన్న రెడ్ క్రాస్ సొసైటీ పని దినాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని,ఈ యోగా మూడునెలల పాటు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ శిక్షణ అనంతరం ఫస్ట్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్సీ సభ్యులు బోను రామకృష్ణ, డాక్టర్ అజ్మతుల్లా బేగ్, బళ్ళా శ్రీనివాసరావు, డాక్టర్ జె.సురేష్, బి.పద్మావతి, ట్రైనర్ గోపాలకృష్ణ,రెడ్ క్రాస్ సిబ్బంది గోపీకృష్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలు

**ఆశ్రమ పిల్లలకు నోట్ బుక్స్, స్టేషనరీ పంపిణీ**




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ముచ్చుమిల్లి రోడ్డులో ఉన్న బెతెస్థ న్యూ లైఫ్ సెంటర్‌లో హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సేవా కార్యక్రమంలో వాసంశెట్టి నాగేంద్ర (చిన్న) పాల్గొని, ఆశ్రమంలోని పిల్లలకు 2026-2027 విద్యా సంవత్సరానికి సరిపడే నోట్ బుక్స్, స్టేషనరీ వస్తువులను విరాళంగా అందించారు. నిరుపేద పిల్లల చదువుకు చేదోడుగా నిలవడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. కార్యక్రమంలో రత్నంపేట మున్సిపల్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు పద్మావతి, బెతెస్థ న్యూ లైఫ్ సెంటర్ నిర్వాహకులు అలెగ్జాండర్, ప్రిస్సిల్ల, ఆశ్రమ సిబ్బంది మరియు పిల్లలు పాల్గొన్నారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




ఆదివారం, 28 జూన్, 2026

4

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమూహ బద్ధత     www.viswamvoice.com


నాయకత్వ లక్షణాల పెంపునకు

## విద్యార్థులకు బాధ్యతల కేటాయింపు : డీఎస్పీ ఎ.శివప్రియ

రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి నాయకుల పదవి స్వీకార వేడుకలు







**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థి నాయకుల పదవి స్వీకార వేడుక రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్, సంపత్ నగర్, రాజమహేంద్రవరం నందు విద్యార్థి నాయకుల పదవీ స్వీకార వేడుక విద్యార్థి సంఘాల కవాతుల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్, సౌత్ జోన్, రాజమండ్రి ఎ.శివప్రియని పాఠశాల డైరెక్టర్స్ తేతలి స్వరూప రెడ్డి,తేతలి సత్య సౌందర్య, పాఠశాల ప్రిన్సిపల్ టి.వి.డి. చంద్రశేఖర్, స్కూల్ విద్యార్థి సంఘం నాయకులు అత్యంత గౌరవంగా ఆహ్వానించారు. కొత్తగా ఎన్నికైన విద్యార్థి సంఘ నాయకులను పరిచయం చేసుకుని అభినందించి, వారికి బాధ్యతలను ప్రమాణ స్వీకారం ద్వారా అప్పగించి ప్రోత్సహించారు. సౌత్ జోన్ డిప్యూటీ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ ఎ. శివప్రియ మాట్లాడుతూ ఈ చిన్నపిల్లల కార్యక్రమానికి ఆహ్వానించినందుకు సంతోషాన్ని వ్యక్తపరిచి స్కూల్ విద్యార్థులను తీర్చిదిద్దడంలో యాజమాన్యపు కృషిని అభినందించారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాయకత్వ బాధ్యతలు అధికారికంగా అప్పగించే కార్యక్రమమే ఇన్వెస్టిచర్ సెర్మనీ అని అంటూ దీనిని తెలుగులో పదవీ స్వీకార వేడుక అని అంటారని విద్యార్థులకు సభికులకు తెలియజేశారు. ఈ కార్యక్రమం ముఖ్యంగా విద్యార్థులు ఐక్యత, క్రమశిక్షణ, సేవాభావం మరియు బాధ్యతతో తమను తాము నమ్ముకుంటూ భవిష్యత్తులో విద్యార్థులు మంచి స్థాయికి చేరడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. తోటి విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలిచేందుకు, వారిలో ఆత్మవిశ్వాసం మరియు ఐక్యతా భావం పెరగడానికి ఈ వేడుక సహాయపడుతుందని అన్నారు. తోటి విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలిచేందుకు, వారిలో ఆత్మవిశ్వాసం మరియు ఐక్యతా భావం పెరగడానికి ఈ వేడుక సహాయపడుతుంది. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ తేతలి స్వరూప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, నిజాయితీ మరియు బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించే ఉద్దేశంతో స్కూల్ పీపుల్ లీడర్, స్కూల్ కెప్టెన్, వైస్ కెప్టెన్, హౌస్ కెప్టెన్లు, క్రీడా నాయకులను అధికారికంగా ఎన్నుకోవడం జరుగుతుందని అన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ టి.వి.డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ వేడుకలో జరిగే ముఖ్య కార్యక్రమం విద్యార్థులకు బ్యాడ్జ్‌ల ప్రదానం చేసి బ్యాడ్జ్‌లు విద్యార్థులకు పెట్టి మరియు సాష్‌లు కూడా తొడుగుతారని విద్యార్థి నాయకుల చేత తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు కవాతు నిర్వహించి పాఠశాల జెండాను ఎగురవేసి, విద్యార్థి నాయకత్వ బృందం తమ నిబద్ధతను చాటుకుంది. స్కూల్ హెడ్ గర్ల్‌గా ఎంపికైన పవిత్ర కంతేటిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి దుర్గేష్‌ను కలిసిన

## విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు అద్దాల కుమార్ బాబు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎస్సీ ఎస్టీ బీసీల అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంతో శ్రమిస్తున్నారని అన్నారు.అదే విధంగా ఎస్సీ ఎస్టీలకు ఏ విధమైన అసౌకర్యం కలిగిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని,వాటిని సామరస్యంగా పరిష్కరించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ నాయకులు తాళ్లూరి విజయకుమార్, ఎస్సీ మహిళా నాయకురాలు జి.సరోజినీ దేవి తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు


## నేడే పల్స్ పోలియో ఆదివారం



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలియో రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమం నేడు (ఆదివారం) దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్నారులకు పోలియో వ్యాక్సిన్ అందించనున్నారు. ఇప్పటికే ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. పోలియో వ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రతి తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో మందు వేయించి చిన్నారుల నిండు జీవితానికి భద్రత కల్పించాలని అధికారులు సూచించారు. పోలియో చుక్కలు వేయడం ద్వారా చిన్నారుల ఆరోగ్య భవిష్యత్తుకు భరోసా కలుగుతుందని తెలిపారు.

## వైభవంగా శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర వార్షిక కల్యాణోత్సవం

– మహా బిల్వార్చన, ఏకాదశ మహా రుద్రాభిషేకం






**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** కోరుకొండలో కొలువైయున్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవం భక్తుల సహకారం, ఆలయకమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శనివారం స్వామివారి వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని వేద పండితులు స్వామి అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు, వివిధ ఫల పుష్పాలతో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్ల వార్షిక కళ్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చరణలతో అశేష భక్తుల సుబ్రహ్మణ్యేశ్వర నామస్మరణలతో వైభవోపేతంగా నిర్వహించగా కళ్యాణోత్సవాన్ని తిలకించిన యావన్మంది భక్తులు భక్తి పారవశ్యంతో మునిగి తేలారు. స్వర్గీయ ప్రగల్లపాటి సత్య కామేశ్వరరావు జ్ఞాపకార్థం సతీమణి సూర్యభవాని, కుమారుడు కామేష్ భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణకు

## పెద్దాపురం రూరల్‌లో విస్తృత ప్రచారం

ఇంటింటికి వెళ్లి అవగాహనలో నిమ్మకాయల రంగనాథ్, కుడుపూడి సత్తిబాబు



**పెద్దాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓటు హక్కు పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గం రూరల్ మండలంలోని 26 నుంచి 31 పోలింగ్ బూత్‌ల పరిధిలో శనివారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదేశాలు, మార్గదర్శకత్వంలో కాకినాడ పార్లమెంట్ ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాథ్ తో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ మరియు పెద్దాపురం నియోజకవర్గ పార్టీ పరిశీలకులు కుడుపూడి సత్తిబాబు,ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, ఓటరు నమోదు, పేరు సవరణ, చిరునామా మార్పు, ఇతర వివరాల నవీకరణకు సంబంధించిన ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానిక బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు)తో సమావేశమై ప్రత్యేక సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. దరఖాస్తు ఫారాలు నింపడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓటర్లకు స్వయంగా సూచనలు అందించి, అవసరమైన వివరాలు సక్రమంగా నమోదు చేసేలా మార్గనిర్దేశం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగబద్ధమైన హక్కు అని అన్నారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయింపుకు గురికాకుండా ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు అవసరమైన దరఖాస్తులు సమర్పించాలని కోరారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి బూత్ పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ నూనె రామారావు గారు, తొలి తిరుపతి గ్రామ కమిటీ అధ్యక్షులు రేలంగి బుజ్జి, బూత్ ఇంచార్జ్ రేలంగి వెంకట్రావు, మండల ప్రెసిడెంట్ ఎమ్.కృష్ణమూర్తి, వాటర్ సంఘం డైరెక్టర్ ఆర్. సత్యనారాయణ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండలంలో తొలకరి వరి సాగు జోరు

16,300 ఎకరాలలో సాగుకు సన్నద్ధం

వివరాలు వెల్లడించిన వ్యవసాయ అధికారి రవి



**కపిలేశ్వరపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** తొలకరి వరి సాగుకు కపిలేశ్వరపురం మండల పరిధిలో రైతులు ముమ్మరంగా సన్నద్ధమవుతున్నారని మండల వ్యవసాయ శాఖ అధికారి బలుసు రవి తెలిపారు. ఈ ఏడాది మండలంలో సుమారు 16,300 ఎకరాల్లో వరి పంట సాగు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. తొలకరి సీజన్‌లో రైతులు ప్రధానంగా ఎంటియు-79 (స్వర్ణ) రకం వరిని ఎంపిక చేసుకుని నాట్లకు సిద్ధమవుతున్నారని ఏఓ తెలిపారు. ఇప్పటికే 630 ఎకరాల్లో నారుమడులు సిద్ధం కాగా, 12,843 ఎకరాల్లో నాట్ల కోసం పొలాలను రైతులు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. నారు నాటే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఒక చదరపు మీటరుకు 33 కుదుళ్లు ఉండేలా నాట్లు వేయాలని, అలాగే ఐదు సెంట్ల నారుమడికి ఒక కిలో కార్బొఫ్ హైడ్రోక్లోరైడ్ గుళికలు చల్లాలని సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించేందుకు ప్రతి గ్రామంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పర్యటిస్తూ ప్రభుత్వం చేపట్టిన 'రైతన్నా... మీకోసం' కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వ్యవసాయ అధికారి రవి తెలిపారు.

## 29న నిజ జ్యేష్ఠ శ్రీ మహాలక్ష్మి సహిత చండీహోమం




**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెల 29న మెసేజ్ శ్రీ మహాలక్ష్మి సహిత చండీ హోమం నిర్వహిస్తున్నట్లు బ్రహ్మ శ్రీ వడలి కుమార్ శర్మ తెలిపారు. ఆస్థిక భక్తజనులకి అందుబాటు ప్రదేశమైన కొలమూరులోని కోలమూరు శ్రీ పద్మాక్షి నగర్‌లో ఉన్న పెట్రోల్ బంకు దగ్గర యాగశాల వద్ద జరుగుతుందన్నారు.సకల విఘ్నములు నివృత్తికి- లక్ష్మీగణపతి,జాతకరీత్యా, గోచార రీత్యా, గ్రహశాంతికి - నవగ్రహ, దారిద్ర్య నివృత్తి కి-శ్రీ మహాలక్ష్మి కమళాలయ హోమము, సర్వ అరిష్ఠనివృత్తికి - శ్రీ చండీహోమము, ఐశ్వర్య ప్రాప్తికి - చంద్రమౌళీశ్వరుడుకి మహన్యాసపూర్వక ఏకవారరుద్రాభిషేకము ప్రతీ పౌర్ణమికి జరుగుతుందని తెలిపారు. అనంతరం పూర్ణాహుతి, అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈ హోమం వల్ల వ్యాపార, ఉద్యోగ, గృహ అశాంతి తొలగుతాయని,సామూహిక లలితా సహస్ర పారాయణ, కనకధారా స్తోత్ర పారాయణ కూడా జరుగుతుందన్నారు. ఈ సదావకాశమును అందరూ సద్వినియోగ పరుచుకొని భగవత్ అనుగ్రహము పొందాలని ఆయన కోరారు. జ్యేష్ఠ పౌర్ణమి రోజైన సోమవారము హోమం జరుగుతుందన్నారు. లోకకళ్యాణార్థమై విశేష ఆధ్యాత్మిక కార్యక్రమములు ప్రతినిత్యం జరిపిస్తున్నామన్నారు.

## సమాజ సేవలో భాగస్వాములు కావాలి

– ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. విద్యా సంస్థలు, దేవాలయాలు, ప్రజా అవసరాలకు ఉదారంగా విరాళాలు అందిస్తున్న దాతలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన అన్నారు. వివిఎల్ పురంలోని శ్యామలాంబ పాఠశాల అభివృద్ధి కోసం తోట మోహన్ శ్రీరామ కిరణ్ రూ.50,000 విరాళాన్ని, కోటిలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న స్వాగత ఆర్చ్ నిర్మాణానికి తోట వెంకటేశ్వరరావు రూ.1,00,000 విరాళాన్ని శనివారం తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల సహకారంతోడైతే మరింత వేగంగా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. విద్యాభివృద్ధికి, ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి, సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూతనివ్వడం గొప్ప సంప్రదాయమని పేర్కొన్నారు. సమాజానికి తిరిగి ఇవ్వాలనే స్ఫూర్తితో ముందుకు వస్తున్న దాతలను అభినందిస్తూ, వారి సేవా భావం మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని, అదే సమయంలో సామాజిక బాధ్యతతో ప్రజలు కూడా తమ వంతు సహకారం అందిస్తే విద్య, వైద్యం, ఆధ్యాత్మిక రంగాలతో పాటు అనేక సేవా కార్యక్రమాలు మరింత బలోపేతం అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. విరాళాలు అందించిన తోట మోహన్ శ్రీరామ కిరణ్, తోట వెంకటేశ్వరరావులను ఎమ్మెల్యే వాసు ప్రత్యేకంగా అభినందించి, వారి సేవా దృక్పథాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో చల్లా కేశవరావు, చల్లా బాలమురళి, కంటిపూడి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వ వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

ఆదివారం, 28 జూన్ 2026
www.viswamvoice.com






# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పకడ్బందీగా నిర్వహించాలి

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని జిల్లాలో పూర్తిస్థాయి పారదర్శకతతో, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ వైఖోం నైదియాదేవి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక గోదావరి భవన్‌లో ప్రతి మండలానికి ఇటీవల నియమితులైన ఏఈఆర్‌వోలకు ఎన్యూమరేషన్ ఫారాలు, ఫారం-6, ఫారం-7, ఫారం-8, డిక్లరేషన్ ఫారాలు నింపే విధానంపై నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఖచ్చితత్వంతో కూడిన ఓటర్ల జాబితాయే పునాదని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి అధికారి, సిబ్బంది ఈ బాధ్యతను అత్యంత అంకితభావంతో నిర్వర్తించాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్యూమరేషన్ ఫారం నింపే విధానం, ఫారం-6, 7, 8తో పాటు డిక్లరేషన్ ఫారాల వివరాలపై సమగ్ర అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ, యువకుడిని ఓటరుగా నమోదు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ముఖ్యంగా కళాశాల విద్యార్థులు, కొత్త ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో నకిలీ ఓట్లు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల నమోదైన ఓట్లు (డూప్లికేట్), మరణించిన వారి పేర్లను చట్టపరమైన నిబంధనల ప్రకారం ఫారం-7 ద్వారా తొలగించాలని తెలిపారు. ఓటర్ల పేర్లు, చిరునామాల్లో

జేసీ వైఖోం నైదియాదేవి



ఎలాంటి తప్పులు లేకుండా క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం అందిస్తున్న ఆధునిక యాప్‌లు, ఐటీ పోర్టళ్లను సమర్థవంతంగా వినియోగించి పారదర్శకంగా జాబితాలు రూపొందించాలని, ఆన్‌లైన్ ద్వారా వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు సవరణ ప్రక్రియపై పూర్తిస్థాయి శిక్షణ తప్పనిసరిగా ఇవ్వాలని పేర్కొన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి అలసత్వాన్ని సహించబోమని, విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఇంటింటి సర్వే ముమ్మరంగా కొనసాగుతోందని, ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ 98 శాతం పూర్తయ్యిందని వెల్లడించారు. జిల్లా రెవెన్యూ అధికారి వి.సుబ్బారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తగా అర్హత పొందిన ఓటర్ల నమోదుతో పాటు మరణించిన వారు, వలస వెళ్లిన వారు, మార్పులు అవసరమైన వివరాలను గుర్తించి జాబితాను ఖచ్చితంగా రూపొందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బూత్ లెవల్ అధికారులు క్షేత్రస్థాయిలో మూడు దఫాల ఇంటింటి పరిశీలనలు నిర్వహించి ఓటర్లకు అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాలో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, అర్హులైన యువత తమ పేర్లను నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి ఓటరు తమ వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఉప ఎంపీడీవోలు, ఎంఈఓలు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్లు, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

### మన ద్రాక్షారామం.. మన బాధ్యత..

# ఇదే మంత్రి సుభాష్ సంకల్పం

## వారం రోజుల్లో నూతన మార్కెట్ షెడ్ల నిర్మాణం బాధితుల పునరావాసానికి వేగవంతమైన చర్యలు



**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ముందుండే నాయకుడు.. "మన ద్రాక్షా రామం.. మన బాధ్యత" అనే లక్ష్యంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అగ్నిప్రమాద బాధితులకు అండగా నిలుస్తున్నారని కూటమి పార్టీ నాయకులు పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం అగ్నిప్రమాదంలో దగ్ధమైన ద్రాక్షారామం మార్కెట్ ప్రాంతాన్ని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు సందర్శించి బాధితులను పరామర్శించారు. బాధిత వ్యాపారులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పిన నాయకులు ప్రమాదం జరిగిన తొలి క్షణం నుంచే మంత్రి వాసంశెట్టి సుభాష్ పరిస్థితిని అత్యంత సీరియస్‌గా తీసుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. మార్కెట్ ప్రాంతాన్ని వెంటనే శుభ్రపరిచి వారం రోజుల్లో నూతన షెడ్లు నిర్మించి బాధితులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారని వెల్లడించారు. మన ద్రాక్షారామం.. మన బాధ్యత అనే ఆశయంతో మార్కెట్‌కు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలి అనే పిలుపునిచ్చిన మంత్రి సుభాష్ స్వయంగా రూ.20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించి తన ప్రజలపై ఉన్న ప్రేమను చాటుకున్నారని నాయకులు పేర్కొన్నారు. అంతేకాకుండా తన పిలుపునకు స్పందించిన దాతలతో సమన్వయం చేసి సుమారు రూ.66 లక్షల విరాళాలు సమకూర్చే బాధ్యతను స్వయంగా తీసుకుని బాధిత కుటుంబాలకు అండగా నిలిచారని కొనియాడారు. సాటి మనుషులు ఆపదలో ఉన్నప్పుడు చేయూత అందించేందుకు ముందుకు వచ్చిన మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్, ప్రతి దాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారంతో బాధిత వ్యాపారులు తిరిగి తమ జీవితాలను గాడిలో పెట్టుకునే అవకాశం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మార్కెట్‌ను సందర్శించిన కూటమి నాయకులతో మాట్లాడిన అగ్నిప్రమాద బాధితులు భావోద్వేగానికి గురయ్యారు. ప్రమాదం జరిగిన సమయం నుంచి ఇప్పటి వరకు ప్రతి క్షణం తమతోనే ఉండి, అన్ని విధాలుగా అండగా నిలిచిన మంత్రి సుభాష్ సేవా భావాన్ని జీవితాంతం మరచిపోలేమని అన్నారు. ఎంతోమంది రాజకీయ నాయకులను చూశాం.. కానీ ప్రమాదం జరిగిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని, బాధితుల కన్నీరు తుడిచి, పునరావాసం కోసం నిరంతరం శ్రమిస్తున్న మంత్రి సుభాష్ మానవత్వం, సేవా గుణం ఎప్పటికీ గుర్తుండిపోతుంది అంటూ పలువురు వర్తకులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ లు మాట్లాడుతూ తన నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలన్న భావన, కృత నిశ్చయంతో మంత్రి సుభాష్ నిరంతరం పనిచేస్తున్నారని అన్నారు. జిల్లా యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ, మార్కెట్‌ను అత్యవసరంగా పునరుద్ధరించి వ్యాపారులు తిరిగి తమ ఉపాధిని ప్రారంభించుకునేలా చర్యలు చేపట్టారని తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన తీరుపై సమగ్ర దర్యాప్తు నిర్వహించేందుకు గుంటూరు నుంచి ఉన్నతాధికారులు కూడా వస్తున్నారని, ప్రమాదానికి గల అసలు కారణాలును అన్ని కోణాల్లో విచారించి వెలికి తీస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవెల్లి శివ, రామచంద్రపురం రూరల్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, ద్రాక్షారామం మాజీ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కూటమి పార్టీ నాయకులు, వర్తక సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాత్ర సుబ్రహ్మణ్యంకు ఘన సన్మానం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) అమలాపురం బ్రాంచ్ కార్యాలయంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న నాత్ర సుబ్రహ్మణ్యం పదోన్నతిపై సహాయ బ్రాంచ్ మేనేజర్‌గా తుని ఎల్ఐసీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన 2007 సెప్టెంబర్ 17న ఉద్యోగంలో చేరి, 19 సంవత్సరాల సేవను పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం అమలాపురంలోని ఆయన స్వగృహంలో ఉద్యోగులు, ఏజెంట్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి అల్లవరం మండల అధ్యక్షుడు ఇళ్ల శేషారావు, ఎంట్రుకోన గ్రామ సర్పంచ్ టిక్కిరెడ్డి నాగ వెంకట శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇళ్ల శేషారావు మాట్లాడుతూ ఎన్నో విజయాలు సాధించడంతో పాటు అనేక మంది నిరుద్యోగులను ఉద్యోగులుగా తీర్చిదిద్దిన ఘనత నాత్ర సుబ్రహ్మణ్యంకే దక్కుతుందని అన్నారు. ఖాతాదారులకు ఏ సమస్య వచ్చినా పరిష్కారం లభించే వరకు కృషి చేసే వ్యక్తి అని కొనియాడారు. టిక్కిరెడ్డి నాగ వెంకట శ్రీనివాస్ మాట్లాడుతూ, నీతి, నిజాయితీ, నిబద్ధత, సమయపాలనకు నాత్ర సుబ్రహ్మణ్యం నిదర్శనమని అన్నారు. తోటి ఉద్యోగులతో స్నేహపూర్వకంగా, వినియోగదారులతో ఆత్మీయంగా వ్యవహరిస్తూ విశేష సేవలు అందించారని ప్రశంసించారు. అనంతరం నాత్ర సుబ్రహ్మణ్యం, అన్నపూర్ణ, విశాలి దంపతులను గజమాలలు, దుశాలువలు, సన్మాన పత్రంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శీలం లంకేశ్వరుడు, ప్రెస్సంగి వెంకటేశ్వర్లు, కముజు శ్రీనివాస్, సత్యారావు, ఆకుల రామకృష్ణ, చిక్కం సత్యదుర్గారావు, రేవు రవి, కోరుకొండ శివ, పుచ్చకాయల వెంకటరావు, సఖిలే కనకదుర్గ, లతా మంగేష్కర్, చింతలపూడి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## కాపు సామాజిక వర్గీయుల సమస్యలపై త్వరలో భారీ సమావేశం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో కాపు సామాజిక వర్గీయులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో కార్యచరణ రూపొందిస్తున్నట్లు ఉభయరాష్ట్రాల కాపు సంఘ నాయకుడు ముత్యాల రామ్ దాస్ అన్నారు. శనివారం అమలాపురం కాపు రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు నల్ల విష్ణుమూర్తి స్వగృహంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపుల అభ్యున్నతికి కృషి చేసే విధంగా పార్టీలకతీతంగా త్వరలో సమావేశం ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.

### షాదీఖానాలో ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్‌కు

## ఎమ్మెల్యే ఆనందరావు శంకుస్థాపన



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణంలోని షాదీఖానా ఆవరణలోని ఖాళీ స్థలంలో నిర్మించనున్న ఆధునిక షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శనివారం శంకుస్థాపన చేశారు. వక్ఫ్ బోర్డు రివాల్వింగ్ ఫండ్ (తిరిగి చెల్లించే విధానం) నిధులతో ఈ నూతన వాణిజ్య సముదాయాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా మత పెద్దల సమక్షంలో ప్రత్యేక భూమి పూజ, ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమంతో పాటు అమలాపురం పట్టణ సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. షాదీఖానా ఆవరణలో నిర్మించనున్న ఈ షాపింగ్ కాంప్లెక్స్ ద్వారా వచ్చే ఆదాయం భవిష్యత్తులో స్థానిక మైనారిటీల సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పనకు ఉపయోగపడుతుందని తెలిపారు. నిర్మాణ పనులను ఎలాంటి రాజీ లేకుండా అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు (సోంబాబు), జామియా మసీదు అధ్యక్షుడు జనాబ్ మహమ్మద్ షహెన్షా, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ముక్రం, కూటమి పార్టీల నాయకులు, మైనారిటీ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు షఫీ ఉల్లా, మహమ్మద్ వలి, మహమ్మద్ అమీర్, ఆబిద్, షఫీ, మస్తాన్, పింజారి మహమ్మద్, ఆజమ్, పీర్ భాష, మోబిన్, బాజిల్లు, ముస్లిం సోదరులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అస్తవ్యస్తంగా రాజోలు గురుకుల గర్ల్స్ హాస్టల్

**గురుకుల బాలికల హాస్టల్‌ను సందర్శించిన ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు**

**సమస్యలపై సర్వే నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ - నిరుపయోగంగా మారిన సోలార్ విద్యుత్ వ్యవస్థ**



**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజోలు గురుకుల గర్ల్స్ హాస్టల్‌లో అస్తవ్యస్తంగా ఉన్న వసతులు - తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. రాజోలు పరిధిలోని గురుకుల బాలికల హాస్టల్‌ను ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె. శంకర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పి.శివ సంయుక్తంగా సందర్శించి, అక్కడ విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో బాలికల కనీస అవసరాలు కూడా తీరని భయానక పరిస్థితులు వెలుగుచూశాయి.


**సర్వేలో వెల్లడైన ప్రధాన సమస్యలు**

**కలుషిత నీటి ప్రమాదం:** హాస్టల్‌లోని వాటర్ ట్యాంకులను చాలా కాలంగా శుద్ధి చేయలేదు. దీనికి తోడు తాగునీరందించే ఆర్ఓ ప్లాంట్లు కూడా సరిగ్గా పనిచేయకపోవడంతో విద్యార్థినులు కలుషిత నీరు తాగి రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. అలాగే హాస్టల్‌లో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ వ్యవస్థ పూర్తిగా నిరుపయోగంగా మారింది. మరోవైపు డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడం వల్ల స్వల్ప వర్షాలకే హాస్టల్ ప్రాంగణంలో మోకాళ్ళ లోతు నీరు నిలిచిపోతోంది. దీంతో దోమల వ్యాప్తికి, అంటువ్యాధులకు ఇది నిలయంగా మారిందన్నారు. ఇంకోవైపు సుమారు 500 మంది బాలికలు నివసిస్తున్న ఈ హాస్టల్‌లో కనీసం ఆడుకోవడానికి గానీ, శారీరక వ్యాయామానికి గానీ ఎటువంటి ఆటస్థలం లేదని మండిపడ్డారు. ఇంకోవైపు హాస్టల్ చుట్టూ పిచ్చి మొక్కలు, పొదలు భారీగా పెరిగిపోయాయి. లైటింగ్ సరిగ్గా లేకపోవడం, పొదలు దట్టంగా ఉండటంతో విషకీటకాలు, పాములు వచ్చే ప్రమాదం పొంచి ఉందని విద్యార్థినులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. 500 మంది ఆడపిల్లలు ఉండే గురుకుల హాస్టల్‌లో ఇటువంటి దారుణమైన పరిస్థితులు ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. తాగునీరు, డ్రైనేజీ, భద్రత వంటి కనీస వసతులు కల్పించడంలో విఫలమైతే విద్యార్థినుల ప్రాణాలకు ఎవరు బాధ్యత వహిస్తారు?" అని నాయకులు ప్రశ్నించారు. యుద్ధప్రాతిపదికన వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించి, ఆర్ఓ ప్లాంట్లను బాగు చేయాలను డిమాండ్ చేశారు. హాస్టల్ ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి, డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సూచించారు. అలాగే విద్యార్థినులకు ఆటస్థలం ఏర్పాటు చేయడంతో పాటు సోలార్ సిస్టమ్‌ను పునరుద్ధరించాలి. ఈ సమస్యలపై సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కె.శంకర్, పి.శివ హెచ్చరించారు.

## ఈ మంచినీళ్లు తాగితే ఇంకా అంతే హాస్పటల్ పాలే..

**నల్లగుంట గ్రామంలోని దుర్వాసన వస్తున్నా వాటర్ ట్యాంకు**

**పంచాయతీ అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం**



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం దేవగుప్తంలోని నల్లగుంట గ్రామంలో త్రాగునీరు అస్తవ్యస్తంగా మారింది. స్థానిక వాటర్ ట్యాంక్ నుంచి వస్తున్న తాగునీరు పూర్తిగా కాలువ నీటిలా మురికిగా, దుర్వాసనతో వస్తోందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నీరు తాగడానికి, వంటకు, రోజువారీ అవసరాలకు ఏమాత్రం పనికిరావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ నీటిని ఉపయోగించడం వల్ల ప్రజలకు అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన చేపట్టారు. పంచాయతీ అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు వెంటనే వాటర్ ట్యాంక్‌ను శుభ్రపరచి, నీటి నాణ్యతను పరీక్షించి, స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని గ్రామస్థుల డిమాండ్ చేస్తున్నారు.

## కలెక్టర్ చొరవతో మస్కట్‌లో చిక్కుకున్న మహిళకు విముక్తి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మస్కట్‌లో ఉపాధి కోసం వెళ్లి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు గ్రామానికి చెందిన ఆర్.రాజకుమారిని జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల చొరవతో సురక్షితంగా భారతదేశానికి రప్పించారు. కుటుంబ పోషణ కోసం రాజకుమారి ఈ ఏడాది మార్చి 17న నారాయణరావు అనే ఏజెంట్ ద్వారా మస్కట్‌కు వెళ్లారు. అక్కడ అధిక పని గంటలు, తీవ్రమైన పని ఒత్తిడి కారణంగా ఆమె ఆరోగ్యం క్షీణించి, పనిచేయలేని పరిస్థితికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అమలాపురం కలెక్టరేట్‌లోని కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ (ఖజవీ)ను ఆశ్రయించారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే కేఎస్ఎం అధికారులు సంబంధిత ఏజెంట్‌తో పాటు ఇతర వర్గాలతో సమన్వయం చేసి, కుటుంబ సభ్యుల సహకారంతో రాజకుమారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ నోడల్ అధికారి వి.సుబ్బారావు మాట్లాడుతూ, విదేశాలకు ఉపాధి కోసం వెళ్లే వారు తప్పనిసరిగా కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను సంప్రదించి పూర్తి అవగాహనతో, చట్టబద్ధమైన మార్గాల్లో మాత్రమే వెళ్లాలని సూచించారు. సమన్వయకర్త గోళ్ళ రమేష్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో వలస కార్మికుల సంక్షేమం కోసం కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ నిరంతరం సేవలు అందిస్తోందని, విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వలస కార్మికులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో

## పోలీసులు వేగంగా స్పందించాలి : పుణ్యమంతుల రజని



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా స్థాయి రెండో త్రైమాసిక సమీక్షా సమావేశం జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి అధ్యక్షతన కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు పుణ్యమంతుల రజని గత ఐదు నెలల కాలంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, అలాగే వివిధ సామాజిక సమస్యలకు సంబంధించిన నివేదికను సమర్పించారు. రజని మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరిగే అట్రాసిటీ కేసుల్లో పోలీసులు ఎలాంటి ఆలస్యం చేయకుండా వాస్తవాలను నిర్ధారించి నిందితులపై వెంటనే కేసులు నమోదు చేయాలని కోరారు. ఆలస్యం జరిగితే ఇరువర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. బాధితుల పట్ల పోలీసులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జిల్లాలోని అనేక ఎస్సీ, ఎస్టీ కాలనీలు, పేటల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చాలా ప్రాంతాల్లో రహదారులు కూడా దయనీయ స్థితిలో ఉన్నాయని చెప్పారు. స్మశానవాటికలకు వెళ్లే రహదారులు లేకపోవడంతో, ముఖ్యంగా వర్షాకాలంలో మృతదేహాలను తరలించేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించినట్లు రజని మీడియాకు వెల్లడించారు.

## స్నేహబంధాలను మరోసారి గుర్తుచేసిన స్వర్ణోత్సవ వేడుకలు

**50 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై..సెయింట్ జాన్స్ పూర్వ విద్యార్థులు**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** 1975-76 విద్యా సంవత్సరంలో అమలాపురం సెయింట్ జాన్స్ హై స్కూల్‌లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రవణం సూర్యచంద్రరావు ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకల్లో సుమారు ఐదు దశాబ్దాల అనంతరం ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆనందోత్సాహాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల రోజుల్లోని మధుర జ్ఞాపకాలు, గురువుల బోధనలు, సహపాఠులతో గడిపిన అనుభవాలను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. స్నేహబంధాలు, గురుశిష్య సంబంధాల విలువను మరోసారి చాటిచెప్పిన ఈ స్వర్ణోత్సవ వేడుకలు ఆత్మీయ వాతావరణంలో కొనసాగాయి. పూర్వ విద్యార్థులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆత్మీయ కలయికలను కొనసాగించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ జిల్లా ఎడిషన్

ఆదివారం, 28 జూన్ 2026
www.viswamvoice.com





# రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం

## జనసేన నాయకులు రెడ్డిపల్లి భాస్కర్



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జనసేన పార్టీ నిరంతరం శ్రమిస్తోందని ఆ పార్టీ యువ నాయకుడు రెడ్డిపల్లి భాస్కర్ స్పష్టం చేశారు. కరప మండలం పెనుగుదురు గ్రామంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాకినాడ రూరల్ నియోజకవర్గంలో కేవలం రెండున్నర ఏళ్లలోనే దాదాపు రూ. 1140 కోట్ల నిధులతో అసాధారణ అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. ఎమ్మెల్యే పంతం నానాజీ, యువ నాయకుడు పంతం సందీప్ రైతాంగ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో నిరంతరం శ్రమిస్తున్నారని, పెనుగుదురు నుండి గొర్రిపూడి ప్రధాన కాలువ పూడికతీత పనులను ఎమ్మెల్యే తన సొంత నిధులతో పూర్తి చేయించారని కొనియాడారు. కొందరు నేతలు అసభ్య పదజాలంతో రాజకీయాలను కలుషితం చేస్తున్నారని మండిపడిన ఆయన, జనసేన ఎప్పుడూ అభివృద్ధి విషయంలోనే పోటీ పడుతుందని స్పష్టం చేశారు. గతంలో అధికారంలో ఉండి శాంతిభద్రతలను విస్మరించి, రౌడీయిజం ప్రదర్శించినందుకే ప్రజలు వైసీపీని గత ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకే పరిమితం చేశారని రెడ్డిపల్లి భాస్కర్ పునరుద్ఘాటించారు. మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నదని స్పష్టం చేశారు.రైతుల సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు అల్లు రమేష్, పులపకూర మహేష్, అల్లు త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల

# పనుల్లో వేగం పెంచాలి : జిల్లా కలెక్టర్



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు(ఆర్.వో.బీ), రైల్వే అండర్ పాస్(ఆర్.యూ.పీ) ల నిర్మాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లా పరిధిలోని జాతీయ రహదారులు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ పాస్ లకు అవసరమైన భూ సేకరణ పనులు పురోగతిపై శనివారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్.. రెవెన్యూ, ఆర్ అండ్ బి, పంచాయతీ, వివిధ మండలాల తహశీల్దార్లు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్.హెచ్ఏఐ, రైల్వే అధికారు ఈ సమావేశానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. భూ సేకరణలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి కీలకమైన జాతీయ రహదారులు, రైల్వే మౌలిక వసతుల నిమిత్తం చేపట్టిన పనులకు సంబంధించిన అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. ప్రాజెక్టు వారీగా భూ సేకరణ అంశాలపై, భూ యజమానులతో మాట్లాడి సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని సూచించారు. భారత్ మాల (వాకలపూడి నుంచి అన్నవరం), రైల్వే గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్ట్ (కేజీపీఎల్ నుంచి అన్నవరం) వరకు చేపట్టనున్న పనులకు సంబంధించి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, పనుల్లో వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పనులపై సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ కొనసాగించి, పనుల్లో పురోగతి కనబరచాలన్నారు. ఈ పనులు అన్నింటినీ నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేలా అధికారులకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పే నాయక్, జిల్లా రిజిస్ట్రార్ కె.ప్రసాద్ రావు, కాకినాడ ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, కెఆర్ఆర్సీ ఎస్డీసీ జి.రత్నమణి, ఆర్ అండ్ బి, పంచాయతీ, తొండంగి, యు.కొత్తపల్లి, కాకినాడ రూరల్ మండలాల తహశీల్దార్లు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీఎల్‌వోలకు పూర్తి సహకారం అందించాలి

## రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఈఆర్‌వో కేటీ సుధాకర్ సూచన



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో బీఎల్‌వోలు (బిఎల్ఓలు ) ఫీల్డ్ స్థాయిలో నిర్వహిస్తున్న ఇంటింటి ధృవీకరణకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్‌వో) కేటీ సుధాకర్ సూచించారు. శనివారం సాయంత్రం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలోని సమావేశం హాల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఈ ఆర్ ఓ కేటీ సుధాకర్ మాట్లాడుతూ ఫీల్డ్‌లో పనిచేసే బీఎల్‌వోలకు అవసరమైన మార్గదర్శకాలు, సమాచారం, సహాయం ఎప్పటికప్పుడు అందించాలని ఆయన అన్నారు. ఓటర్ల వివరాల పరిశీలనలో ఎక్కడైనా లోపాలు లేదా వ్యత్యాసాలు కనిపిస్తే వెంటనే సరిదిద్దే విధంగా సూచించారు. బీఎల్‌వోలు గుర్తించిన సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించి, ఓటరు జాబితాలో ఉన్న లోపాలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇంటింటి సర్వేలో ఎలాంటి ఖాళీలు లేకుండా ప్రతి ప్రాంతాన్ని పూర్తిగా కవర్ చేయాలని, ఫీల్డ్ స్థాయిలో సమన్వయంతో పనిచేస్తే ఓటరు జాబితా మరింత ఖచ్చితత్వంతో రూపొందుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువుల్లో అన్ని కార్యక్రమాలను పూర్తి చేసేందుకు బిఎల్ఏ ఇలా పూర్తి సహకారం అందించవలసిందిగా రాజకీయ పార్టీల ప్రతినిధులను ఈఆర్‌వో కేటి సుధాకర్ కోరారు. ఈ సమావేశంలో ఏఈఆర్ఓలు అర్బన్ తహసిల్దార్ వి.జితేంద్ర, డిప్యూటీ కమిషనర్ కే.శ్రీనివాస్,డీసీపీ కృష్ణారావు, ఎన్నికల విభాగం డిప్యూటీ తాసిల్దార్ కె.గోవిందరాజులు, టిపిఆర్ఓ శైలజ, అనిల్, సూపర్వైజర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాపులకు సీఎం పదవి ఇచ్చే దమ్ము, ధైర్యం వైసీపీకి ఉందా?



**సీఎం పదవి అడిగితే వైసీపీ కాపు నాయకులను జగన్ కుక్కల దొడ్డిలో కట్టేస్తాడు**
**కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తే సహించేది లేదు**
**వైసీపీ కాపు నాయకుల వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్**

**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాపు సామాజిక వర్గం పేరుతో రాజకీయాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే వైసీపీ కాపు నాయకుల ప్రయత్నాలను ఇకపై సహించబోమని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఘాటుగా హెచ్చరించారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌పై వైసీపీకి చెందిన కొందరు కాపు నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన కాకినాడ క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ కాపుల సంక్షేమం గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీకి లేదని విమర్శించారు. వైసీపీ కాపు నాయకులు నిజంగా కాపు సామాజిక వర్గం అభ్యున్నతిని కోరుకుంటే, వచ్చే ఎన్నికల్లో కాపు నాయకుడిని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించే ధైర్యం ఉందా అని ఎంపీ సవాల్ విసిరారు. కాపులపై మొసలి కన్నీరు కారుస్తున్న వైసీపీ నాయకులు ముందుగా తమ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వద్దకు వెళ్లి కాపు సామాజిక వర్గానికి సీఎం పదవి ఇవ్వాలని డిమాండ్ చేయాలని సూచించారు. అలా అడిగే ధైర్యం కూడా వాళ్ళకి లేదని, అడిగిన మరుక్షణం సో కాల్డ్ కాపు నాయకులను కుక్కల దొడ్డిలో కట్టి వేయకపోతే తన పేరును మార్చుకుంటానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ సవాల్ విసిరారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో రాష్ట్రంలో "రెడ్ల రాజ్యం" నడిచిందని, ఎన్నికల సమయంలో "నా ఎస్సీలు, నా బీసీలు, నా ఎస్టీలు, నా మైనార్టీలు" అంటూ గుండెలు బాదుకున్న జగన్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత కీలక పదవులు, అధికార స్థానాలు మాత్రం తన సొంత సామాజిక వర్గానికే కట్టబెట్టారని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఏద్దేవా చేశారు. సామాజిక న్యాయం పేరుతో ప్రజలను మోసం చేసిన వైసీపీ నాయకులు ఇప్పుడు కాపుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. జనసేన పార్టీ అధికారంలోకి వస్తే కాపు లదే సీఎం పీఠం అని, కాపు సమాజానికి రాజకీయంగా సముచిత గుర్తింపు, గౌరవం కల్పించే పార్టీ జనసేన మాత్రమేనని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనాలు పొందాలని ఎవరైనా ప్రయత్నిస్తే ప్రజలు తిప్పికొడతారని, అలాంటి కుట్రలను సహించేది లేదని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హెచ్చరించారు. రాష్ట్రంలో అన్ని కులాలు, అన్ని వర్గాలు కలిసిమెలిసి అభివృద్ధి చెందడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజలు అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చే నాయకత్వానికే మద్దతు ఇస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కులాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టే వైసీపీ నాయకులకు ప్రజలే బుద్ధి చెబుతారని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హెచ్చరించారు.

# హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల ప్రజలు నిర్లక్ష్య ధోరణి విడాలి : కలెక్టర్



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజానికి పెనుముప్పుగా కొనసాగుతున్న హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రజలు నిర్లక్ష్య ధోరణి విడనాడాలని, సమూల నిర్మూలనకు సమిష్టిగా పోరాడాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ కోరారు. శనివారం రాత్రి కలెక్టరేట్ కోర్టు హాలులో ఎయిడ్స్ నిరోధం, నియంత్రణపై ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లాలో హెచ్ఐవి, ఎయిడ్స్ ఉనికి, నిరోధం, నియంత్రణకు చేపడుతున్న చర్యలు, పటిష్ట పరచాల్సిన కార్యాచరణ అంశాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. జిల్లాలో అమలు చేస్తున్న ఎయిడ్స్ నిరోధ కార్యక్రమాల వల్ల వ్యాధి వ్యాప్తిని గణనీయంగా నియంత్రించ గలిగామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 18,848 హెచ్ఐవి కేసులు నమోదు కాగా 15,167 మంది ఏఆర్టీ చికిత్స పొందుతున్నారని, 13,351 మందిలో వైరల్ లోడ్‌ను తగ్గించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో హెచ్ఐవి పాజిటీవ్‌గా గుర్తించిన ప్రతి ఒక్కరికీ తప్పని సరిగా ఎఆర్టీ చికిత్స అందిచాలని, ఏ ఒక్క వ్యక్తి ఎయిడ్స్ కారణంగా చనిపోకూడదని అధికా రులకు సూచించారు. ఆధార్ ట్రాకింగ్ ద్వారా హెచ్ఐవి పాజిటీవ్ గా గుర్తించిన ఏ వ్యక్తి చికిత్స పరిధి నుండి తప్పిపోకుండా చూడాలని ఆదేశించారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలలో నిర్లిప్త ధోరణి చోటు చేసుకుంటోందని, అజాగ్రత్త వహిస్తే వ్యాధి చాపక్రింద నీరులా ప్రభలి సమాజానికి పెనుముప్పుగా మారే ప్రమాదాన్ని అందరూ గుర్తించాలని కలెక్టర్ కోరారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన, అప్రమత్తతను పెంపొందించే కార్యక్రమాలను జిల్లా అంతటా విస్తృతంగా నిర్వహించాలని కోరారు. జిల్లాలోని 8 ఏఆర్టీ చికిత్సా కేంద్రాలలో ఎల్లవేళలా మందులు అందుబాటులో ఉండేలా బఫర్ నిల్వలు ఉంచాలని, రోగులకు అంతరాయం లేకుండా చికిత్స కొనసాగేలా చూడాలని ఆదేశించారు. పరిశ్రమలలో పనిచేసే వలస కార్మికులకు ఆన్ సైట్ పరీక్షలు చేపటాలని, సెక్స్ వర్కర్లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యామ్నాయ ఉపాధితో కొత్త జీవితాన్ని కల్పించాలని అధికారులకు సూచించారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టి కృషితో వచ్చే డిశంబరు నాటికి జిల్లాలో ఎహెచ్ఐవి, ఎయిడ్స్ స్థాయిని సురక్షిత్ ప్లస్ స్థాయికి నియంత్రించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డా.ఎస్.చలమయ్య, డిఎంహెచ్ఓ డా.జె.నరశింహనాయక్, కమిటీలోని సభ్య అధికారులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా యుసియుకె కాలేజి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** జవహర్లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడ (జేఎన్టీయూకే) పరిధిలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కాకినాడ (యూసీఈకే) లో గ్రాడ్యుయేషన్ డే-2026 కార్యక్రమం శనివారం జెఎన్టిటియుకె అలుమ్ని ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. పద్మ రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూసీఈకే ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.పద్మ రాజు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన కళాశాల అకాడెమిక్ నివేదికను సభలో సమర్పించారు. కళాశాల విద్యా ప్రగతి, పరిశోధన, ప్లేస్మెంట్లు, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి విజయాలు, విద్యార్థుల ప్రతిభ, అధ్యాపకుల పరిశోధన కార్యక్రమాలు, మౌలిక వసతుల అభివృద్ధి, పరిశ్రమలతో భాగస్వామ్యాలు, ఇన్నోవేషన్ మరియు స్టార్టప్ కార్యక్రమాలపై నివేదికలో సమగ్రంగా వివరించారు. యూసీఈకే విద్యార్థులు విద్యా ప్రమాణాలు, నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాల పరంగా విశిష్ట విజయాలు సాధిస్తూ విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకువస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ "గ్రాడ్యుయేషన్ అనేది విద్యార్థి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి. ఇది విద్యా ప్రయాణానికి ముగింపు కాదు, సమాజ సేవకు, వృత్తి జీవితానికి, నిరంతర అభ్యాసానికి నాంది. నేటి ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో విద్యార్థులు జీవితాంతం నేర్చుకునే మనస్తత్వాన్ని అలవర్చుకోవాలి. ఇంజినీర్లుగా మీపై సమాజానికి, దేశానికి ఉన్న బాధ్యతను గుర్తించి, మీ జ్ఞానం, నైపుణ్యాలను ప్రజల సంక్షేమానికి వినియోగించాలి." అని అన్నారు."సాంకేతిక నైపుణ్యాలతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, నిజాయితీ, నాయకత్వ లక్షణాలు ప్రతి విద్యార్థికి ఎంతో అవసరం. ఉద్యోగ అవకాశాల కోసం మాత్రమే కాకుండా, ఉద్యోగాలను సృష్టించే పారిశ్రామికవేత్తలుగా, ఆవిష్కర్తలుగా ఎదగాలి. పరిశోధన, ఆవిష్కరణలు, స్టార్టప్లు, కృత్రిమ మేధస్సు, సుస్థిర అభివృద్ధి వంటి రంగాల్లో యువత ముందుండి దేశ అభివృద్ధికి తోడ్పడాలి." అని సూచించారు. "జేఎన్టీయూకే విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా తమ ప్రతిభను చాటుకుంటూ విశ్వవిద్యాలయానికి విశిష్ట గుర్తింపు తీసుకువస్తున్నారు. నేడు పట్టభద్రులుగా బయటకు వెళ్తున్న ప్రతి విద్యార్థి తమ తల్లిదండ్రులు, అధ్యాపకులు, విశ్వవిద్యాలయం గర్వపడేలా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నాను.మీరు ఎక్కడ ఉన్నా జేఎన్టీయూకేతో అనుబంధాన్ని కొనసాగిస్తూ, మీ అనుభవాన్ని తదుపరి తరాలకు పంచుకోవాలని కోరుతున్నాను. పట్టభద్రులందరికి అభినందనలు, ఉజ్వల భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు." అని ఉపకులపతి పేర్కొన్నారు.అనంతరం 2025--26 విద్యా సంవత్సరంలో పట్టభద్రులైన 216 మంది విద్యార్థులు ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.పద్మ రాజు చేతుల మీదుగా డిగ్రీ సర్టిఫికెట్లను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అకాడెమిక్స్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. వి. ఎస్.ఆర్.దీక్షితులు, అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.స్వరూప రాణి, విభాగాధిపతులు, అధ్యాపకులు, పట్టభద్రులు, వారి తల్లిదండ్రులు పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మానవత్వమే మంత్రి సుభాష్ చిరునామా.. సమాజసేవే ఆయన కుటుంబ ధ్యేయం


**ఆపదలో అండగా నిలిచిన మంత్రి సుభాష్‌కు బీసీ, దళిత సంఘాల అభినందనలు**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవతా విలువలకు ప్రతిరూపంగాసేవా భావానికి నిదర్శనంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని రామచంద్రపురం నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు దంగేటి గౌరీశంకర్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి వనుం వీరబ్రహ్మం పేర్కొన్నారు. రామచంద్రపురంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ద్రాక్షారామం మార్కెట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 48 దుకాణాలు పూర్తిగా దగ్ధమై, మూడు తరాలుగా వ్యాపారాన్ని నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాలు ఒక్కసారిగా జీవనాధారాన్ని కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే అర్ధరాత్రి వేళ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శిస్తూ సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించిన మంత్రి సుభాష్ మానవత్వానికి నిదర్శనమన్నారు. ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించి అండగా నిలిచిన నాయకుడు రామచంద్రపురం చరిత్రలో అరుదుగా కనిపిస్తారని కొనియాడారు. మంత్రి సుభాష్ మంత్రిగా కాకుండా సాటి మనిషిగా స్పందించి అగ్నిప్రమాద బాధితులకు వ్యక్తిగతంగా రూ. 20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించడంతో పాటు, పలువురు దాతలను సమన్వయం చేసి సుమారు రూ. 66 లక్షల విరాళాలు సమీకరించడం అసాధారణ సేవాభావానికి నిదర్శనమని అన్నారు. అలాగే సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం కూడా సేవే పరమావధిగా ప్రతి ఆపదలో ప్రజలకు అండగా నిలుస్తూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్నారని ప్రశంసించారు. అన్ని వర్గాల ప్రజలను సమదృష్టితో చూస్తూ కష్టం అంటే కనికరం చూపించి సహాయం చేస్తున్న మంత్రి సుభాష్ కుటుంబానికి ప్రజలు రుణపడి ఉంటారన్నారు. సేవా కార్యక్రమాలపై కూడా విమర్శలు చేస్తూ, ప్రతి విషయాన్ని రాజకీయం చేసే రాజకీయ నాయకులు ప్రజల కష్టాల్లో భాగస్వామ్యం కాకుండా విమర్శలకే పరిమితమవ్వడం బాధాకరమని దళిత సంఘాల నేతలు కాటే సుబ్రహ్మణ్యం, రవ్వా భూషణం అన్నారు. పదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి, వారి జీవితాల్లో ఆశాకిరణం నింపిన వాడే నిజమైన నాయకుడని, అలాంటి నాయకుడు మంత్రి సుభాష్ అని దళిత సంఘాల నాయకులు కాటే సుబ్రమణ్యం, రవ్వ భూషణం, తనికెళ్ల సత్తిబాబు తదితరులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడిశెట్టి సూర్యనారాయణ, గుబ్బల రమణ, విత్తనాల వెంకటరమణ, వాసంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజులో రాయితీ ఇవ్వాలని

# కలెక్టర్ సర్క్యులర్ జారీ




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో పనిచేయుచున్న వర్కింగ్ జర్నలిస్ట్ పిల్లలకు 2026-27విద్యా సంవత్సరానికి సంబంధించి 50శాతం ఫీజు రాయితీ అవకాశం జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ కల్పించారని కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్, కార్యదర్శి డెంకాడ మోహన్ తెలిపారు. ఫీజు రాయితీ కోరుతూ గత వారం జిల్లా కలెక్టర్‌కు కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ తరపున ప్రాతినిధ్యం వహిస్తు వినతిపత్రం అందజేసిన సంగతి తెలిసిందే.దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలను జర్నలిస్ట్ పిల్లలకు ఫీజు రాయితీ తప్పనిసరిగా వర్తింపజేయాలని ఆదేశిస్తూ సర్క్యులర్ జారీ చేశారని తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టులందరు ఈ అవకాశం వినియోగించుకోవాలని సూచించారు.

# సర్ డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

## కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ - సర్‌కు సంబంధించి కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి, కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు శనివారం కాకినాడ రూరల్ మండలం ఇంద్ర పాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని 142వ పోలింగ్ కేంద్రం జరుగుతున్న ఓటర్ల ఎన్యూమినేషన్ పత్రాల పంపిణీ, డిజిటలేషన్ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మల్లి బాబు మాట్లాడుతూ కాకినాడ రూరల్ నియోజకవర్గంలో రెండు లక్షల 71 వేల 318 ఓట్లకు గాను రెండు లక్షల 58 వేల 748 ఎన్యుమరేషన్ పత్రాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎన్యుమరేషన్ పంపిణి చేసిన పత్రాలలో ఇప్పటి వరకు సుమారు 32 వేలు ఎన్యుమరేషన్ పత్రాలు డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందన్నారు. 264 పోలింగ్ కేంద్రాలలో డిజిటలైజేషన్ ప్రక్రియ జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ పరిశీలనలో ఆర్డీవో వెంట పోలింగ్ బూతు స్థాయి అధికారులు, రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

### ద్రాక్షారామ ఘటనకు

# చలించిన జనసేన నాయకుడు నాగేంద్ర

## అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన వ్యాపారులకు అండ డిఎన్ఎఫ్ ద్వారా 3 లక్షల ఆర్థిక సహాయం



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామ మార్కెట్లో అగ్ని ప్రమాదం కారణంగా మంటల్లో సర్వం కోల్పోయిన వ్యాపారులకు కాజులూరు మండలం బందనపూడి గ్రామానికి చెందిన డిఎన్ఎఫ్ ఫౌండర్, జనసేన నాయకుడు దేగల నాగేంద్ర అండగా నిలిచారు. దుబాయిలో ఉంటున్న నాగేంద్ర అగ్నిప్రమాదంలో దుకాణాలు కాలి బూడిదైనా దుస్తుతిని సామాజిక మధ్యమాల ద్వారా తెలుసుకున్నారు. అగ్నిప్రమాదంలో నష్టపోయిన వ్యాపారస్తులను స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఆదుకోవాలన్న రాష్ట్ర కార్మికశాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపు మేరకు నాగేంద్ర నేనుసైతం అని స్పందించారు. రామచంద్రపురం నియోజకవర్గంలో లక్షలాది రూపాయలతో పేదలకు ఇప్పటికే ఎన్నో సేవ కార్యక్రమాలు చేపడుతున్న దేగల నాగేంద్ర తన డిఎన్ఎఫ్ ఫౌండేషన్ ద్వారా జనసేన పార్టీ తరుపున 3 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించారు. త్వరలో డిఎన్ఎఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామచంద్రపురం నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ సమక్షంలో ఆ మొత్తాన్ని బాధితులకు అందించనున్నట్లు తెలిపారు. అగ్ని ప్రమాద బాధితులకు అవకాశమున్న మిగతా స్వచ్ఛంద సంస్థలు, దాతలు సైతం సహకారం అందించి అండగా నిలవాలని నాగేంద్ర కోరారు. నాగేంద్ర సేవాగుణాన్ని పలువురు అభినందిస్తున్నారు.

### మోడరన్ కాలేజీలో

# ముక్కుతో బొమ్మ గీసిన సత్యవోలు రాంబాబు




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముక్కుతో బొమ్మలు గీస్తూ ప్రపంచంలోనే అరుదైన గుర్తింపు తెచ్చుకున్న చిత్రకారుడు, విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ అధినేత సత్యవోలు రాంబాబు శనివారం మోడరన్ కాలేజీకి వచ్చారు. అక్కడ కాలేజీ పిల్లలు, సిబ్బంది ముందర ముక్కుతో ఈశ్వరుడి బొమ్మను క్షణాల వ్యవధిలో గీసి అందరినీ ఆశ్చర్యపరిచారు. చిన్నప్పటి నుంచే తనకు చిత్రకళ అంటే ఎంతో ఇష్టమని రాంబాబు చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 'సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్' సంస్థను నడుపుతూ ఎంతో మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా రకరకాల రంగాల్లో ప్రతిభ చూపించే వారికి సేవ చేసే వారికి విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ తరపున పురస్కారాలు ఇస్తున్నట్లు వివరించారు. ప్రపంచంలోనే అరుదైన కళాకారుడైన రాంబాబు తమ కాలేజీకి రావడం ఎంతో ఆనందంగా ఉందని మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు అన్నారు. గతంలో తాను కూడా పెద్దల చేతుల మీదుగా విశ్వగురు అవార్డు అందుకున్న విషయాన్ని గుర్తు చేసుకున్నారు. పట్టుదలతో శ్రమించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాంబాబు నేటి యువతకు ఆదర్శమని మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, ఇంటర్ ప్రిన్సిపాల్ సిహెచ్.రాజేష్, కాలేజీ సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
ఆదివారం, 28 జూన్ 2026
www.viswamvoice.com



# డ్రగ్స్‌కు దూరంగా.. టెక్నాలజీ దగ్గరగా ఉండాలి...

**విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు - విద్యార్థులకు చట్టాలు, సైబర్ నేరాలు, మహిళల భద్రతపై అవగాహన**

**"మీ భద్రత - మా బాధ్యత" కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** "తల్లికి నేరుగా చెప్పలేని పని జీవితంలో ఎప్పుడూ చేయొద్దు" అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి తమ జీవిత సూత్రంగా మలచుకోవాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రతి నిర్ణయం తీసుకునే ముందు "ఈ విషయం నా తల్లికి ధైర్యంగా చెప్పగలనా?" అనే ప్రశ్నను తమను తాము వేసుకుంటే జీవితంలో తప్పుదారులు పట్టే పరిస్థితి ఎప్పటికీ రాదని ఆయన పేర్కొన్నారు. నిజాయితీ, క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన ప్రవర్తనతో కూడిన జీవన విధానమే గొప్ప వ్యక్తిత్వానికి, విజయవంతమైన భవిష్యత్తుకు బలమైన పునాది అని అన్నారు. రాజమహేంద్రవరం లోని విజయదుర్గా జూనియర్ కళాశాలలో నిర్వహించిన "మీ భద్రత - మా బాధ్యత" అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు ఎంత బలంగా ఉంటే రాష్ట్ర భవిష్యత్తు కూడా అంతే బలంగా ఉంటుందని పేర్కొంటూ... యువత సరైన దిశలో ఎదగడం సమాజ పురోగతికి ఎంతో అవసరమన్నారు. విద్యార్థి దశ జీవితాన్ని మలిచే అత్యంత కీలకమైన కాలమని పేర్కొన్న ఆయన, ఈ సమయంలో అలవర్చుకునే క్రమ శిక్షణ, విలువలు, అలవాట్లు జీవితాంతం వెంట ఉంటాయని చెప్పారు. అందుకే ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తర్వాత ఏ రంగంలో ముందుకు వెళ్లాలను కుంటున్నారో ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకుని దానికి అనుగుణంగా చదువులు, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రపంచం వేగంగా మారుతోందని, భవిష్యత్తు పూర్తిగా సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఉండబోతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్ వంటి రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం కూడా ఈ మార్పులకు అనుగుణంగా ప్రపంచ స్థాయి పరిశ్రమలను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువస్తోందని చెప్పారు. గూగుల్ డేటా సెంటర్, ఇన్ఫోసిస్, టీసీఎస్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి అంతర్జాతీయ, జాతీయ స్థాయి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించబడుతున్నాయని తెలిపారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకో వాలంటే విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, నాయకత్వ లక్షణాలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. యువతను తప్పుదోవ పట్టిస్తున్న అతిపెద్ద సామాజిక సమస్యల్లో డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం ప్రధానమని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. ఒకసారి మత్తు వ్యసనాలకు బానిసైతే వ్యక్తిగత జీవితం మాత్రమే కాదు, కుటుంబ భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. క్షణికానందం కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. స్నేహితులను ఎన్నుకునే విషయంలో విద్యార్థులు చాలా జాగ్రత్తగా ఉండాలని ఆయన అన్నారు. మంచి స్నేహితులు జీవితాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తారని, చెడు స్నేహితులు జీవితాన్ని చీకట్లోకి నెట్టేస్తారని పేర్కొన్నారు. స్నేహం చేసే ముందు వారి ఆలోచనలు, అలవాట్లు, లక్ష్యాలను గమనించాలని సూచించారు. మహిళల భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. "మీ భద్రత - మా బాధ్యత" కార్యక్రమం ద్వారా మహిళా రక్షక్ బృందాలను మరింత బలోపేతం చేసి మహిళలు, బాలికలు నిర్భయంగా విద్యను అభ్యసించే, ఉద్యోగాలు చేసే, స్వేచ్ఛగా సంచరించే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని చెప్పారు. మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, సైబర్ వేధింపులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియా వినియోగం విస్తృతంగా పెరిగిన నేపథ్యంలో సైబర్ నేరాల పట్ల కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్, బ్యాంకు వివరాలు ఇతరులకు తెలియకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తెలియని వ్యక్తుల సందేశాలు, లింకులు, ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా అనుమానాస్పద సంఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో కష్టాలు పడుతున్నారని గుర్తు చేసిన ఆయన, వారి త్యాగాలను ఎప్పటికీ మర్చిపోవద్దని విద్యార్థులకు సూచించారు. వారి ఆశయాలను నెరవేర్చే విధంగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవడమే తల్లిదండ్రులకు ఇచ్చే గొప్ప బహుమతి అని అన్నారు. కుటుంబ గౌరవాన్ని నిలబెట్టే విధంగా ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా జీవించాలని ఆకాంక్షించారు. విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాదని, సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగా తీర్చిదిద్దేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మంచి విలువలు, సేవాభావం, దేశభక్తి, సామాజిక బాధ్యతతో కూడిన యువతే దేశానికి నిజమైన సంపద అని అన్నారు. ప్రతి విద్యార్థి తన ప్రతిభతో రాజమహేంద్రవరం పేరును రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గర్వంగా వినిపించేలా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసులు విద్యార్థులకు మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలు, అత్యవసర సహాయ సేవలు, విద్యార్థులు పాటించాల్సిన భద్రతా నియమాలు, మత్తు పదార్థాల దుష్పరిణామాలు, సామాజిక బాధ్యత వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, పోలీసు అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**దేశానికి యువత ఓ వెన్నుముక..**

# అలాంటి వారి ఆశలను నిర్వీర్యం చేస్తుంది

**బిజెపి ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే 9 మంది విద్యార్థుల ఆత్మహత్యలు, 98 సార్లు పేపర్లు లీకులు**

**మోడీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించింది : బాలేపల్లి మురళీధర్,డాక్టర్ టికె విశ్వేశ్వర రెడ్డి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతదేశంలోని బిజెపి ప్రభుత్వం విద్యా వ్యవస్థను తీవ్రంగా భ్రష్టు పట్టిస్తోందని, కనీసం విద్యావ్యవస్థలో ఉన్న పరీక్షలను పగడ్బందీగా నిర్వహించలేని దౌర్భాగ్య స్థితిని కల్పిస్తుందని పలువురు వక్తలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలోని స్థానిక మున్సిపల్ కాలనీ వద్ద గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్, పార్లమెంట్ కోఆర్డినేటర్ టికె విశ్వేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్, పార్లమెంట్ కోఆర్డినేటర్ టి కె విశ్వేశ్వర రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ఆకుల భాగ్యలక్ష్మిలు మాట్లాడారు. దేశంలోని మోడీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తూ ముందుకు సాగుతుందన్నారు. కనీసం నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలు నిర్వహించలేని దౌర్భాగ్య స్థితిలో పాలన కొనసాగు తుందని ఆరోపించారు. విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి, వివిధ సెంటర్ల వద్ద కోచింగ్ లు తీసుకుని పరీక్షలకు హాజరైతే .. పరీక్ష కాస్త రద్దయితే వారి మనోభావాలు దెబ్బతింటాయని, దీనివల్ల పలువురు యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. పోటీ పరీక్షల రిజల్ట్ కోసం యువత సంవత్సరాలు తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి తలెత్తు తోందన్నారు. దేశంలో వెయ్యి మంది యువకులు పరీక్షలకు హాజరైతే 12 మందికి మాత్రమే ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. మరి మిగతా వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వ పాలనలో ఇచ్చిన వాగ్దానాలు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించారని, అవి నేటికి సరిగ్గా అమలు కాని పరిస్థితి, అగమ్య గోచరంగా పరిస్థితి ఏర్పడిందన్నారు. మోడీ పరిపాలనలో విద్యా వ్యవస్థలో కనీసం పోటీ పరీక్షలు నిర్వహించలేని దౌర్భాగ్య స్థితిలో ఉండటం సిగ్గుచేటన్నారు. దేశ అభివృద్ధికి యువత ఓ వెన్నుముకలాంటివారు.. అలాంటి యువకుల ఆశలను నిర్వీర్యం చేస్తూ దేశ ప్రధాని మోడీ పరిపాలన సాగుతుందన్నారు. యువశక్తిని కోల్పోయేలా మోడీ ప్రభుత్వ పాలన జరుగుతుందన్నారు. ఈ విధానాన్ని దేశ ప్రజల దృష్టిలో పెట్టడం కోసం కాంగ్రెస్ పార్టీ యువనేత రాహుల్ గాంధీ చాత్రో ఠాగూర్ యువగళం పేరుతో రాజస్థాన్లోని కోట ప్రదేశంలో ఈనెల 17వ తేదీన బ్రహ్మాండమైన ర్యాలీను నిర్వహించారని, ఈ ర్యాలీకి లక్షలాది మంది యువత ఉవ్వెత్తున హాజరై జయప్రదం చేస్తూ బ్రహ్మరథం పట్టారన్నారు. యువత, విద్యార్థులు విద్యావ్యవస్థలో పడుతున్న కష్టనష్టాలను తెలుసుకొనేందుకు యువ నేత రాహుల్ గాంధీ పార్టీ తరఫున ఓ ప్రణాళిక కార్యాచరణ సిద్ధం చేస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఆయన ఆదేశాలు పిలుపు మేరకు ప్రతి జిల్లాలో కూడా పత్రికా సమావేశాలు ఏర్పాటుచేసి దేశంలోని బిజెపి పాలనలో యువత, విద్యార్థులకు ఏ విధంగా అన్యాయం జరుగుతుందో అన్నదానిపై, విద్యా సంస్థలు, యూనివర్సిటీలు, హాస్టళ్లు ఆ ప్రదేశాలకు కార్యకర్తలు వెళ్లి అవగాహన కల్పిస్తూ వివరాలు తెలియజేస్తామన్నారు. దీనిపై ప్రచార పత్రాలను సిద్ధం చేసి ప్రజలందరినీ చైతన్య పరచడం, అవగాహన కల్పించడం వంటివి చేయాలని రాహుల్ గాంధీ సూచించారని తెలిపారు. రాహుల్ గాంధీ కూడా విద్యార్థులు, యువత, ముఠా కార్మికులతో మమేకం అవుతూ వారి సమస్యలు వారి దగ్గరకే వెళితే ఎలా పరిష్కారం అవుతాయి అనే ఉద్దేశంతో ఆయనే స్వయంగా రంగంలోకి దిగి అందరితో కరచాలనం చేస్తూ వారి కష్టనష్టాలను అడుగు తెలుసుకుంటున్నారన్నారు. రాబోవు రోజుల్లో వారి సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలనే దానిపై ఆయన కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చాక నీట్ తో సహా 29 పేపర్లు లీక్ అయ్యాయన్నారు. 6.5 కోట్ల మంది యువకులు ఈ పేపర్ల లీక్ కారణంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. 48 సార్లు రీ ఎక్షమ్ పెట్టగా, మళ్లీ 25 సార్లు పూర్తిగా రద్దు చేసినట్లు తెలిపారు. పదేపదే ఇలా పేపర్లను లీక్ చేస్తూ రద్దు చేస్తుంటే యువత పరిస్థితి ఏంటని, ఈ పరిస్థితి కారణంగా వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఎన్నో ఆశలతో ప్రిపేర్ అయిన వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఎంతో కష్టపడి చదివి పరీక్ష రాయడానికి వెళ్లిన తర్వాత ఆ కాగితం 5, 10, 25, 30 లక్షలకు అమ్ముడు పోతుందన్నారు. 2014లో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 4.7గా విద్యా వ్యవస్థకు బడ్జెట్ను కేటాయించిందన్నారు. దేశ ప్రధాని మోడీ పరిపాలనలో 2026-27లో కేంద్ర ప్రభుత్వం విద్యావ్యవస్థకు 2.4 బడ్జెట్ను కేటాయించగా దీనిని పరిశీలిస్తే సగానికి సగం కేటాయింపులు తగ్గించిందన్నారు. ప్రైవేట్ కళాశాలలు, కోచింగ్ సెంటర్లు దొంగ దోపిడీ చేసుకునేలా బిజెపి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకుంటే దేశ ప్రజలకు 1,32,000 కోట్ల రూపాయలు ఖర్చు అవుతున్నట్లు తెలిపారు. దేశ ప్రధాని ప్రవేశపెడుతున్న భారత కా వికాస్ కాదని.. అది కేవలం భారత్ క వినాశనం అని విమర్శించారు. దేశ ప్రధాని పాలనలో నిరుద్యోగ యువత 29.7 గా ఉంటూ 30 శాతానికి చేరి దౌర్భాగ్య స్థితిలో ఉందన్నారు. మోడీ ప్రభుత్వ 12 సంవత్సరాల కాలంలో 98 సార్లు పోటీ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయన్నారు. యుపిఎస్సి, నీట్, సీబీఎస్సీ, వంటి పోటీ పరీక్షలకు 22 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే వీటిలో చాలా వరకు రద్దు అయ్యాయన్నారు. సీబీఎస్సీ 17 లక్షల మంది పరీక్షలు రాస్తే ఒకరికి మరొకరికి వచ్చాయన్నారు. ఏ విధంగా విద్యావ్యవస్థను మోడీ ప్రభుత్వం భ్రష్టు పట్టిస్తుందో అనడానికి ఈ విధానాలే తార్కాణం అన్నారు. ఈ పరీక్షల రద్దు వల్ల 9 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. మోడీ విధానాల వల్ల వారి జీవితాలు నాశనం అయ్యాయన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ అనే వ్యక్తిని విద్యా శాఖ మంత్రిగా దేశ ప్రధాని మోడీ నియమించారని, అయితే ఆయనకు విద్యావ్యవస్థపై అసలు పట్టే లేదని విమర్శించారు. 9 మంది ఆత్మహత్యలు చేసుకుంటే.. పలు పేపర్లు లీక్ అయితే దీనిపై కనీసం ఆయన స్పందన కరువైందన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఆయన అనర్హుడని విమర్శించారు. ఆయన వెంటనే పదవికి రాజీనామా చేయాలని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సారీ సూరిబాబు, బర్రె సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

**బొలేంపల్లి దంపతుల చేతుల మీదుగా**

## పరదేశమాలయానికి శంకుస్థాపన



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని నరసాపురం నుండి కనుపూరు వెళ్లే రోడ్లో పర దేశమ్మ నూతన ఆలయ నిర్మాణానికి బొలేంపల్లి శ్రీరాంబాబు దంపతుల చేతుల మీదుగా శంకుస్థాపన ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నరసాపురం గ్రామస్తులు ఆధ్వర్యంలో పరదేశమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థాన భజనబృందం ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి 20లక్షల రూపాయలు విరాళం ఇవ్వనున్నట్లు బొలేంపల్లి శ్రీరామ్ బాబు దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపాట్టి భీమరాజు, ఎంపిటిసి పీతా శ్రీనుబాబు, మాజీ ఎంపిటిసి రాయపాటి సత్యనారాయణ, గుర్రం ఈశ్వరరావు, మారిశెట్టి సూర్యనారాయణ, కోర్పు రాజేష్, బోజ్జపు అబ్బులు, నీలపాల రామకృష్ణ, వెలిచేటి చిన్ని, కోర్పు చక్రవర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేడే దళిత క్రైస్తవుల ఛలో ఏలూరు

**దళిత క్రైస్తవుల సమర శంఖారావం సభకు తరలిరండి**

**కల్చరల్ కమిటీ సభ్యులు ఉల్లం రవి పిలుపు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దళిత క్రైస్తవుల హక్కుల పరిరక్షణ కోసం హైకోర్టు ప్రముఖ న్యాయవాది, మాజీ న్యాయమూర్తి,జై భీమ్ రావ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణకుమార్ ఆధ్వర్యంలో ఈనెల 28 న ఏలూరులో జరగనున్న దళిత క్రైస్తవుల సమర శంఖారావం బహిరంగ సభకు రాష్ట్రంలోని దళిత, క్రైస్తవులంతా తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాలమహానాడు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు,దళిత క్రైస్తవ సమర శంఖారావం సభ కల్చరల్ కమిటీ సభ్యుడు ఉల్లం రవి పిలుపు నిచ్చారు.మన హక్కుల కోసం,మన గౌరవం కోసం, రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకునేందుకు నిర్వహిస్తున్న ఈ దళిత క్రైస్తవ సమర శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేసి మన సత్తా చాటి చెప్పాలని ఆయన కోరారు.దళిత క్రైస్తవుల హక్కులను హరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు జడ శ్రావణకుమార్ నడుంబిగించారని ఆయనకు అంతా మద్దతుగా నిలవాలని ఉల్లంరవి కోరారు.

**నేడు శెట్టిబలిజ సంఘాలు**

## రౌండ్ టేబుల్ సమావేశం

**శెట్టిబలిజ సంఘీయులపై వేధింపులు ఆపాలి..**

**పెద్దఎత్తున హాజరు కానున్న సంఘ ముఖ్య నాయకులు పిలుపు**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలను, దందాలను ప్రశ్నిస్తున్న కారణంగానే బీసీ నాయకుడు పీతా రామకృష్ణను అన్యాయంగా అరెస్టు చేసి పిడి యాక్ట్ పెట్టారని తూర్పు గోదావరి జిల్లా శెట్టిబలిజ సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే చర్యలను నిరసిస్తూ ఈనెల 28వ తేదీ ఆదివారం రాజమండ్రి ఆర్టీసి కాంప్లెక్స్ వద్దనున్న శ్రీ గ్రాండ్స్‌లో శెట్టిబలిజ సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్, శాసన మండలి సభ్యులు కుడుపూడి సూర్యనారాయణ, కవురు శ్రీనివాస్ మరియు ఉభయ తెలుగు రాష్ట్రాల బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షులు మార్గాని నాగేశ్వరరావుతో సహా ఇతర సంఘ ముఖ్య నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. శెట్టిబలిజ సహా ఇతర బీసీల ఓట్లతో ఎమ్మెల్యేగా నెగ్గి ఇప్పుడు వారిపైనే అక్రమ కేసులు పెట్టడానికి వారు తీవ్రంగా ఖండించారు. కేవలం శెట్టిబలిజ సంఘీయులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆరోపించారు. పేకాట క్లబ్బులు, భూ కబ్జాలు, అక్రమ దందాలు, ఇసుక అక్రమాలు, మద్యం మరియు బెల్ట్ షాపులు, బ్రాకెట్లు తదితర అంశాలపై ప్రశ్నించినందుకే పీతా రామకృష్ణపై అక్రమంగా పిడి యాక్ట్ పెట్టారని పేర్కొన్నారు. అతడిని అరెస్టు చేసి మరునాడు నుంచే యధేచ్ఛగా క్వారీ మార్కెట్ సెంటర్ సహా పలు ప్రాంతాల్లో విచ్చలవిడిగా పేకాట క్లబ్బులు, గ్యాంబింగ్‌లు, బ్రాకెట్లు నడుపుకుంటున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే తీరుపై ఈ సమావేశంలో చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని సంఘీయులు తెలిపారు.

# యానాదులకు మంచినీరు, కరెంట్ ఇవ్వాల్సిందే..

**జూలై 10 నుంచి ఆమరణ దీక్ష చేస్తానన్న హర్షకుమార్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గత 20 సంవత్సరాలుగా కాలువ గట్టున నివాసం ఉంటున్న నిరుపేద యానాదుల కుటుంబాల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి ఇబ్బందులను విని తీవ్రంగా చలించిపోయారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజానగరం మండలం సూర్యారావు పేట కాలువ గట్టున నివసిస్తున్న యానాది ఎస్టీ కుటుంబాల ప్రజలు తక్షణం ప్రభుత్వం, అధికారులు స్పందించి మంచినీరు, విద్యుత్ సౌకర్యం, గృహాల నిర్మాణానికి రుణ సదుపాయం కల్పించాలని మాజీ ఎంజీ జివి హర్షకుమార్ డిమాండ్ చేసారు. కనీసం విద్యుత్, మంచినీటి సదుపాయం లేని దుస్థితిలో సుమారు 45 కుటుంబాలకు చెందిన 200 మందికి పైగా జీవనం సాగించడం దారుణమన్నారు. ముగ్గురు ఎమ్మెల్యేలు వారి వద్ద నుంచి ఓట్లు దండుకోవడమే తప్ప వారి సమస్యలను పరిష్కరించలేదని ధ్వజమెత్తారు. జిల్లా అధికార యంత్రాంగం జూలై 10వ తేదీలోగా వారికి మంచినీరు, విద్యుత్ సదుపాయం కల్పించడంతో పాటు ఇళ్లు నిర్మాణం చేసుకునేందుకు హౌసింగ్ శాఖ ద్వారా రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోకపోతే తాను అక్కడే ఆమరణ దీక్ష చేయడానికి సిద్ధమని ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసలు పేదలే లేరని, విద్యుత్ సదుపాయం లేని ఇళ్లు లేవని చెబుతున్న మాటలన్నీ అబద్ధమేనన్నారు. ఇదే గట్టు వెంబడి పక్కా ఇళ్లు నిర్మించుకున్న వారికి విద్యుత్ ఇచ్చి యానాదులకు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీసారు. అధికారులు ఎస్టీలని వివక్ష చూపడంపై ఆగ్రహం వ్యక్తం చేసారు. ఆయన వెంట గంధం బంగారు బాబు, స్థానిక పెద్దలు ఉన్నారు.






# ఇడుపు కాయితం టైటిల్ మార్చే ప్రసక్తే లేదు..

## వివాదంపై బన్నీ వాస్ రియాక్షన్..

ఇడుపు కాయితం .. గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో మారుమోగుతున్న పేరు. నిజానికి సినిమాలోని సన్నివేశాలు, డైలాగ్స్ గురించి ఎప్పుడూ నెట్టింట ఏదోక చర్చ నడుస్తుంటుంది. కానీ ఈ మూవీ విషయంలో మాత్రం టైటిల్ రివీల్ చేయడంతోనే వివాదం మొదలైంది. ఇటీవల కాలంలో తెలంగాణ యాస, సంస్కృతి మీద అనేక సినిమాలు వస్తున్న సంగతి తెలిసిందే. గతంలో తెలంగాణ గ్రామీణ కథతో వచ్చిన బలగం , మల్లేశం చిత్రాలు భారీ విజయాన్ని అందుకున్నాయి. ఇక ఇప్పుడు మరో మూవీ రూపొందిస్తున్నారు. అదే ఇడుపు కాయితం. ఇందులో ప్రియదర్శి హీరోగా నటిస్తుండగా.. ఫోక్ డ్యాన్సర్ నాగదుర్గ కథానాయికగా నటిస్తుంది. ఈసినిమాతోనే ఆమె హీరోయిన్ గా వెండితెరకు పరిచయం కాబోతుంది. ఇటీవల పూజ కార్యక్రమాలు జరుపుకున్న ఈ సినిమా టైటిల్ రివీల్ చేసింది చిత్రయూనిట్. ఈ సినిమా పేరు ఇడుపు కాయితం అంటూ బైక్ పై సకినాలు, కళ్లు బాటిల్, టిఫిన్ బాక్సులతో కొత్త జంట వెళ్తున్న ఫోటోను రిలీజ్ చేశారు. అయితే ఈ టైటిల్, భాష, యాస విషయంలో రెండు వర్గాలు విడిపోయి ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజా వివాదం పై నిర్మా బన్ని వాస్ స్పందించారు. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదని.. కథను బట్టే టైటిల్ ఉంటుంని వెల్లడించారు. ప్రస్తుతం వివాదం నేపథ్యంలో కథను, టైటిల్ మార్చే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. బన్నీ వాస్ మాట్లాడుతూ. "ప్రతి సినిమాకు దాని కథ, నేపథ్యం బట్టే టైటిల్ ఉంటుంది. ఇకపై దాని గురించి చర్చ అనవసరం. షూటింగ్ కంప్లీట్ అయి సినిమా విడుదలయ్యాక ఆ మూవీనే మాట్లాడుతుంది. ఆంధ్రా తెలంగాణ ఎవరైనా సరే సినిమా నచ్చితేనే చూస్తారు. నచ్చకపోతే చూడరు. నేను చేయాల్సింది సినిమాను బాగా తీయడంపై దృష్టి పెట్టడమే. ప్రస్తుతం ఈ వివాదం వల్ల సినిమాకు కాస్త ఇబ్బంది కలిగింది. కానీ సినిమా బాగుంటే అన్ని సర్దుకుంటాయి. నాకు కథ మీద పూర్తి నమ్మకం ఉంది. దర్శకుడు వచ్చిన ప్రాంతం నుంచి రాసుకున్న కథ ఇది" అని అన్నారు. "ప్రాంతాన్ని బట్టి కథ ఉంటుందా అంటే ఎక్కడో తెరకెక్కించిన హాలీవుడ్ సినిమా ఇక్కడ ఆడదు కదా.. ప్రతి ఇంట్ల ఉండే కథే ఇది. క్లైమాక్స్ అందరిని ఆకట్టుకుంటుంది. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే ముందు ఆలోచించాలి. విభేధాలు తీసుకురాకుండా జాగ్రత్తగా ఉండాలి. ప్రస్తుతం ఉన్న పరిస్థితిల్లో నటీనటులకు డైలీ రెమ్యునరేషన్స్ ఇచ్చి సినిమా చేయలేను. అందుకే కొత్తవాళ్లను ప్రోత్సహిస్తున్నాం. నా బడ్జెట్ కు నా పరిధిలోకి వచ్చేవారితోనే సినిమాలు చేస్తాను" అని అన్నారు. ఇడుపు కాయితం అంటే... విడాకుల పత్రం అని అర్థం. ఒకప్పుడు దంపతులు విడిపోవాలంటే పెద్దల సమక్షంలో ఇడుపు కాయితం రాసుకుని విడిపోయేవారు. ఇప్పటికీ తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో ఇడుపు కాయితం రాసుకుని విడిపోతున్నారు.

# డైరెక్టర్ లవర్ చెప్పిందని నా సీన్స్ తగ్గించేశారు..


## కోపంతో షూటింగ్ నుంచి వచ్చేసా : పూనమ్ కౌర్



నటి పూనమ్ కౌర్ తన సినీ ప్రస్థానంలోని కీలక ఘట్టాలను, ఎదురైన సవాళ్లను ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. చిన్ననాటి నుంచి లాయర్ కావాలనే బలమైన కోరిక ఉన్నట్లు ఆమె తెలిపింది. తన తల్లి పడిన కష్టాలను చూసి, కపిల్ సిబల్ లేదా రామ్ జేఠ్ మలానీ వంటి పవర్ ఫుల్ లాయర్ అవ్వాలని కలలు కన్నానని తెలిపింది. పూనమ్ కౌర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చేసింది కొన్ని సినిమాలే అయినా తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటుంది పూనమ్ కౌర్. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో చేసిన కొన్ని కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. తన సినీ జీవితానికి సంబంధించిన అనేక తెలియని కోణాలను, వ్యక్తిగత ఆకాంక్షలను పంచుకుంది పూనమ్ కౌర్. నటన రంగంలోకి అనుకోకుండా వచ్చినట్లు తెలిపిన పూనమ్, తన అసలు లక్ష్యాలు, బాలీవుడ్‌లో ఎదురైన చేదు అనుభవాలు, ప్రముఖులతో సమావేశాలు, ఒక సినిమా గురువుతో జరిగిన విచిత్ర సంభాషణ గురించి పంచుకుంది. పూనమ్ కౌర్ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే సినిమాలపై పెద్దగా ఆసక్తి చూపలేదని తెలిపింది. తన తల్లి పడిన కష్టాలను చూసి, కపిల్ సిబల్ లేదా రామ్ జేఠ్ మలానీ వంటి ప్రభావవంతమైన లాయర్‌గా మారాలని కలలు కన్నానని ఆమె తెలిపింది. ఒకానొక సందర్భంలో తాను నివసిస్తున్న భవనం తన తండ్రిది అని, ఆయన మరణానంతరం తన తల్లి ఆస్తి కోసం ఏడేళ్లపాటు పోరాడారని గుర్తుచేసుకుంది. లాయర్ కావడానికి ఎన్ఐఎఫ్‌టీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ), నాల్సార్ (నేషనల్ అకాడమీ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్) ప్రవేశ పరీక్షలు రాశానని, నాల్సార్‌లో అవకాశం వస్తే సినిమా వైపు వచ్చేదాన్ని కాదని ఆమె స్పష్టం చేశారు. నటనను తాను కేవలం "పార్ట్-టైమ్ జాబ్" లాగానే చూశానని చెప్పుకొచ్చింది. అలాగే పూనమ్ కౌర్ బాలీవుడ్‌లో తన మొదటి సినిమా అనుభవాన్ని పంచుకుంది. ఒక పెద్ద ఖాన్ బంధువు తీస్తున్న సినిమాలో హీరోయిన్‌గా అవకాశం వచ్చింది. అయితే, షూటింగ్ సమయంలో తనకు జరిగిన అవమానాలను ఆమె చెప్పుకొచ్చింది. కావాలనే తన సన్నివేశాలను తగ్గించడం, తన మేకప్‌ను మార్చడం, ఒక ప్రత్యేక నటి (దర్శకుడి ప్రియురాలు)కి అనుకూలంగా వ్యవహరించడం వంటివి జరిగాయని ఆమె తెలిపింది.




## వైభవ్ సూర్యవంశీలో
# ఆ సత్తా ఉంది : వెంగ్‌సర్కార్



ఐర్లాండ్‌తో తొలి టీ20లో వైభవ్ సూర్యవంశీ బరిలోకి దిగుతాడని అంతా భావించారు. కానీ, మేనేజ్‌మెంట్ అతడికి అవకాశం ఇవ్వలేదు. వన్‌డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌తోపాటు సంజు శాంసన్ విఫలమై నిరాశపరిచారు. దీంతో వైభవ్‌కు ఛాన్స్ ఇవ్వాలనే డిమాండ్లు ఎక్కువైపోయాయి. అలాగే అతడు కేవలం టీ20లు మాత్రమే ఆడగలడని.. వన్డేలు, టెస్టులకు పనికిరాడంటూ కొందరు చేసిన వ్యాఖ్యలను మాజీ క్రికెటర్ దిలీప్ వెంగ్‌సర్కార్ కొట్టిపడేశాడు. వైభవ్‌కు ఆ సత్తా ఉందని స్పష్టం చేశాడు. ఐర్లాండ్‌తో రెండో టీ20లో అతడికి ఛాన్స్ వచ్చే అవకాశం ఉందన్నాడు. "తప్పకుండా వైభవ్‌కు ఐర్లాండ్‌తో రెండో టీ20లో అవకాశం వస్తుంది. ఒక్కసారి బరిలోకి దిగాడంటే.. రెండు చేతులతో అందిపుచ్చుకుంటాడు. అసాధ్యమనుకునే షాట్లు కొడుతున్నాడు. అతడిలో గొప్ప ప్రతిభ ఉంది. బ్యాట్‌ను వినియోగించే తీరు బాగుంది. టీ20 ఫార్మాట్ అతడికి భలేగా సూట్ అయింది. భవిష్యత్తులో అతడు మూడు ఫార్మాట్లలోనూ ఆడతాడా? అంటే ఇప్పుడే ఆ అవకాశాలపై చెప్పలేం. ప్రస్తుతం అతడు పరిమిత ఓవర్ల క్రికెట్‌ను మాత్రమే ఆడుతున్నాడు. ఇంకా అతడి సుదీర్ఘ ఫార్మాట్ ఆటను చూడలేదు. అయితే, ఎప్పుడైనా సరే బరిలోకి దిగితే మాత్రం అక్కడా గొప్ప ప్రదర్శనే చూస్తాం. నేను కూడా అందుకోసమే వేచి చూస్తున్నా" అని వెంగ్‌సర్కార్ తెలిపాడు.

**సచిన్ పరిస్థితి భిన్నం..**

"నేను సచిన్ అరంగేట్రం చేసినప్పటి నుంచి చూస్తున్నా. 16 ఏళ్ల వయసులోనే అతడు మానసికంగానూ పరిణతి చెందినట్లు కనిపించాడు. ఇంటర్-స్కూల్ టోర్నీల్లో అదరగొట్టి మరీ జాతీయ జట్టుకు వచ్చాడు. క్లబ్ క్రికెట్‌లోనూ మెరుగైన ఆటతీరు ప్రదర్శించాడు. అప్పటికే అతడు ఉన్నత స్థాయిలో క్రికెట్ ఆడేందుకు సిద్ధమైపోయాడు. చాలా క్రమశిక్షణతో ఉంటూ ఆటపట్ల అభిరుచి కలిగిన ప్లేయర్. వైభవ్ వంటి కుర్రాళ్లకూ సచిన్ జీవితం స్ఫూర్తి అనడంలో సందేహం లేదు. వైభవ్ మాత్రమే కాదు.. దేవదత్ పడిక్కల్, సర్ఫరాజ్ ఖాన్ వంటి ప్లేయర్లకూ అవకాశాలు ఇవ్వాలి. వారంతా మంచి నైపుణ్యం కలిగిన ఆటగాళ్లు. రాబోయే వన్డే ప్రపంచ కప్‌లో తప్పకుండా హార్దిక్ పాండ్య కీలక పాత్ర పోషిస్తాడని భావిస్తున్నా" అని వెంగ్‌సర్కార్ అన్నాడు.

# టీజీ20 లీగ్.. హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ హ్యాట్రిక్ విజయం



టీజీ20 లీగ్‌లో హైదరాబాద్ 'ఈ' ఛాంపియన్స్ హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. మెదక్ ఫాల్కన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 46 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ నిర్దేశించిన 241 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన మెదక్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 194 రన్స్‌కే పరిమితమైంది. విక్రమ్ నాయక్ (75; 42 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించాడు. రవితేజ 31, ఇషాన్ శర్మ 27, వరుణ్ 38 రన్స్ చేశారు. హైదరాబాద్ బౌలర్లలో అజయ్‌దేవ్ గౌడ్ 4, ప్రణవ్ వర్మ 2 వికెట్లు పడగొట్టారు. శ్రీనికేత్, నితిన్ నాయక్ చెరో వికెట్ తీశారు. మెదక్ ఫాల్కన్స్‌కు నాలుగు మ్యాచ్‌ల్లో వరుసగా ఇది మూడో ఓటమి. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. ఓపెనర్లు సాయివికాస్ రెడ్డి (93; 48 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లు), అభిరథ్ రెడ్డి (59; 27 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) జట్టు భారీ స్కోరు సాధించడానికి గట్టి పునాది వేశారు. చివర్లో గడుగు గణేశ్ (22బి; 7 బంతుల్లో 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. నితిన్ నాయక్ (18), అరవింద్ (17), పరుగులు చేశారు. మెదక్ బౌలర్లలో సయ్యద్ ఘాజీ అబ్బాస్ 2, విక్రమ్ నాయక్ 2, సాయివరుణ్, కార్తికేయ, రవితేజ, అశ్విన్ రామ్ ఒక్కో వికెట్ తీశారు.

# యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

## సెమీస్‌లో యువ సంచలనం రౌనక్

యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు అదరగొట్టేస్తున్నారు. మహిళలు, పురుషుల విభాగంలో ముగ్గురు ప్లేయర్లు సెమీస్‌కు దూసుకెళ్లారు. మహిళల సింగిల్స్‌లో దేవికా సిహాగ్ విజయం సాధించగా.. పురుషుల విభాగంలో కిదాంబి శ్రీకాంత్, రౌనక్ చౌహాన్ సెమీఫైనల్స్‌లో అడుగు పెట్టారు.

**టాప్ ప్లేయర్లను చిత్తు చేసి..**

18 ఏళ్ల రౌనక్ చౌహాన్ ఇప్పుడు బ్యాడ్మింటన్‌లో హాట్ టాపిక్‌గా మారాడు. ప్రిక్వార్టర్‌ఫైనల్స్‌లో ఆరో ర్యాంకర్‌ను ఓడించిన రౌనక్.. క్వార్టర్స్‌లోనూ దూకుడు కొనసాగించాడు. కేవలం 38 నిమిషాల్లోనే ఇజ్రాయెల్‌కు చెందిన ఒలింపియన్ ప్లేయర్ మిషా జిల్బెర్‌మన్‌ను చిత్తు చేశాడు. 23-21, 21-11 తేడాతో విజయం సాధించాడు. దీంతో తొలిసారి మెగా టోర్నీ సెమీస్‌లో అడుగు పెట్టాడు.

**ఆ ఇద్దరు కూడా..**

మరో సింగిల్స్‌లో సీనియర్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ 21-9, 12-21, 21-8 తేడాతో చైనీస్ తైపీ ప్లేయర్ లియావో జౌపుపై విజయం



సాధించాడు. ఇవాళ జరగనున్న సెమీస్‌లో జపాన్‌కు చెందిన నాలుగో సీడ్ యుద్దై ఒకిమోటోతో శ్రీకాంత్ తలపడతాడు. మహిళల విభాగంలో దేవికా 22-20, 21-19 తేడాతో మూడో సీడ్ జపాన్ ప్లేయర్ రికో గున్‌జిపై గెలిచింది.

# అదరగొట్టిన ఆకిబ్.. ఆధిక్యంలో ఇండియా ఎ



ఇండియా-ఎ, శ్రీలంక-ఎ మధ్య జరుగుతున్న తొలి అనధికార టెస్టులో మూడో రోజు ఆట ముగిసింది. ఆట ముగిసే సమయానికి సెకండ్ ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా భారత్-ఎ 48 పరుగులు చేసింది. ఆయుష్ పాండే (20బి), దేవ్‌దత్ పడిక్కల్ (20బి) క్రీజులో ఉన్నారు. సాయి సుదర్శన్ (7) రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. ప్రస్తుతం ఇండియా-ఎ 170 పరుగుల ఆధిక్యంలో ఉంది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో 113/2తో మూడో రోజు ఆటను కొనసాగించిన శ్రీలంక-ఎ 330 పరుగులకు ఆలౌటైంది. నువానిందు (84), అషెన్ బండార (70), సహన్ అరచ్చిగే (72) పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు పెద్ద స్కోర్లు చేయలేదు. భారత బౌలర్లలో ఆకిబ్ నబీ దార్ (4/58) అదరగొట్టాడు. యశ్ ఠాకూర్, హర్ష్ దూబె రెండేసి, అంశుల్ కాంబోజ్, సారాంశ్ జైన్ చెరో వికెట్ పడగొట్టారు. కెప్టెన్ ధ్రువ్ జురెల్ (141 నాటౌట్; 215 బంతుల్లో 13ఐ4, 1ఐ6) అజేయ సెంచరీ సాధించడంతో తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 452/6 వద్ద డిక్లేర్ చేసింది.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com